# ప్రజా తపన

prajathapana.com

News that matters




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక:73 మంగళవారం 02 మే 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




# విడాకులకు 6నెలలు ఆగక్కర్లేదు

**న్యూఢిల్లీ:**

విడాకుల విషయంలో సర్వోన్నత న్యాయస్థానం చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. పునరుద్ధరించలేని విధంగా వైవాహిక బంధం దెబ్బతింటే ఆర్టికల్ 142 ప్రకారం వారికి విడాకులను మంజూరు చేయవచ్చని సుప్రీంకోర్టు సోమవారం సంచలన తీర్పు చెప్పింది. పరిస్థితులను బట్టి పరస్పర అంగీకారంతో విడాకుల కోసం ఆరు నెలల తప్పనిసరి నిరీక్షణ వ్యవధిని రద్దు చేయవచ్చని పేర్కొంది. 'వివాహం కోలుకోలేని విధంగా విచ్ఛిన్నం ఎప్పుడు జరుగుతుందో నిర్ణయించగల అంశాలను కూడా మేం నిర్దేశించాం' అని న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఏఎస్ ఓకా, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ జేకే మహేశ్వరిలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది.ముఖ్యంగా మెయింటెనెన్స్, భరణం, పిల్లల హక్కులకు సంబంధించి అంశాలను ఎలా బ్యాలెన్స్ చేయాలో కూడా ధర్మాసనం వివరించింది. హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 13బి కింద నిర్దేశించిన విధంగా పరస్పర అంగీకారంతో విడాకుల కోసం తప్పనిసరి నిరీక్షణ కాలాన్ని ఆర్టికల్ 142 ప్రకారం తన అపారమైన అధికారాలను వినియోగించుకుని సుప్రీంకోర్టు రద్దు చేయగలదా? అనే అంశంపై రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టింది. పునరుద్ధరించలేని విధంగా దెబ్బతింటే విడాకుల కోసం సుదీర్ఘ న్యాయ విచారణకు కుటుంబ న్యాయస్థానాలకు పంపకుండా రద్దు చేయవచ్చని తెలిపింది.కోలుకోలేని విధంగా విచ్ఛిన్నమైన వివాహాలను రద్దు చేయవచ్చా అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని

02

# తుని రైలు దహనం కేసు కొట్టివేత



**విజయవాడ :**

తుని రైలు దహనం కేసులను రైల్వే కోర్టు కొట్టి వేసింది. మొత్తం 41 మంది నిందితుల విషయంలో సరైన సాక్ష్యాలను చూపించడంలో రైల్వే పోలీసులు విఫలమయ్యారు. సరిగ్గా విచారణ చేయని ముగ్గురు రైల్వే పోలీసులపై చర్యలు తీసుకోవాలని జడ్జి ఆదేశించారు. ఈ ఘటన విషయంలో ముగ్గురు రైల్వే ఉన్నతాధికారులు సరిగా విచారణ చేయలేదని రైల్వే న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. సున్నితమైన అంశాన్ని ఐదేళ్ళపాటు ఎందుకు సాగదీశారని కోర్టు ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్క సాక్షిని మాత్రమే మీరు ప్రవేశపెట్టారని.. ఈ కేసులో పోలీస్ ఉన్నతాధికారులపై ఎందుకు చర్యలు తీసుకో కూడదో వివరణ ఇవ్వాలని వ్యాఖ్యానించింది. ఆధారాలు లేని కారణంగా కేసులో నిందితులుగా ఉన్న 41 మందిపై పెట్టిన కేసు అక్రమ కేసుగా పరిగణిస్తున్నామని కోర్టు స్పష్టం చేసి కేసులను కొట్టి వేసింది. ఈ కేసులో ముద్రగడ

02



## శ్రమజీవుల త్యాగాలే పునాదిరాళ్లు - సీఎం కేసీఆర్

**హైదరాబాద్ :**

కార్మిక, కర్షక, శ్రమ జీవులకు ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. కార్మిక, కర్షక సంక్షేమాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. చెమట చుక్కలను ధారపోసి పరోక్షంగా సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న అందరికీ శుభాకాంక్షలు. తరతరాలుగా కష్టజీవి శ్రమతోనే ప్రపంచంలో సంపద దృష్టి జరుగుతోంది. మహోన్నతమైన విశ్వమానవ సౌధానికి శ్రమజీవుల త్యాగాలే పునాదిరాళ్లు అని సీఎం

02

# రేపు సిఎం జగన్ ఉత్తరాంధ్ర పర్యటన

**విశాఖపట్టణం:**



ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించనున్నారు. మే 3వ తేదీన సీఎం జగన్ విజయనగరం జిల్లాలో భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన, చింతపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం, తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ మిగులు పనులకు శ్రీకారం చుట్టనున్నారు. విశాఖపట్నం? మధురవాడలో వైజాగ్ ఐటీ టెక్ పార్క్‌కు శంకుస్థాపన చేయనున్నారు.ఉదయం 8 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 10 గంటలకు భోగాపురం మండలం ఎ.రావివలస గ్రామం వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 10.25 గంటలకు జీఎంఆర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు చేరుకుంటారు, ఆ సెంటర్‌ను సందర్శిస్తారు. భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి శంకుస్థాపన చేస్తారు. 10.30 గంటలకు భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం, చింతపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం, తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ మిగులు పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. 10.55 గంటలకు సవరవిల్లి వద్ద ఏర్పాటుచేసిన బహిరంగసభ వేదిక వద్దకు చేరుకుంటారు. సభ అనంతరం 1.20 గంటలకు అక్కడి నుంచి విశాఖ పర్యటనకు సీఎం జగన్ బయలుదేరుతారు. మే 3న మధ్యాహ్నం 1.40 గంటలకు విశాఖ మధురవాడ ఐటీ హిల్స్ నెంబర్ 3 వద్ద గల హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. రోడ్డు మార్గంలో


02

# ఐఎస్ ఉగ్రవాద సంస్థ చీఫ్ హతం

**న్యూఢిల్లీ :**

తమ దేశానికి చెందిన ఎంఐటీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ చేపట్టిన ఆపరేషన్‌లో అనుమానిత నాయకుడు సిరియాలో హతమైనట్టు తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ వెల్లడించారు. ఆయన టెలివిజన్‌లో మాట్లాడుతూ.. 'అనుమానిత నేత డేష్ కోడ్‌నేమ్ అబు హుస్సేన్ అల్-ఖురాషి నిన్న (శనివారం) సిరియాలో ఎంఐటీ నిర్వహించిన ఆపరేషన్‌లో హతమయ్యాడు' అని పేర్కొన్నారు. గతేడాది నవంబరు 30న తమ చీఫ్ అబు హసన్ అల్ హసన్ అల్ హషిమీ అల్-ఖురాషీ హతమైనట్టు

02



ఐఎస్ఐఎస్ ప్రకటించాడు.అఫ్రిన్ వాయువ్య ప్రాంతంలోని జిండిరెస్‌లో ఒక జోన్‌ను టర్కీ ఇంటెలిజెన్స్ ఏజెంట్లు, స్థానిక మిలిటరీ పోలీసులు చుట్టుముట్టి.. ఇస్లామిక్ పాఠశాలగా వినియోగిస్తోన్న పాడుబడిన పొలాన్ని లక్ష్యంగా చేసుకున్నారని ఏఎఫ్‌పీ వార్తా సంస్థ తెలిపింది. ఉత్తర సిరియాలో 2020 నుంచి టర్కీ తన దళాలను మోహరించింది. సిరియా దళాల సహాయంతో మొత్తం జోన్‌లను నియంత్రిస్తుంది.ఐరోపా, మధ్యప్రాచ్యంలో దాడులకు ఐఎస్ ప్రణాళికలు వేస్తోందని చెబుతూ ఉత్తర సిరియాలోని ఆ ఉగ్రవాద సంస్థ స్థావరాలపై ఏప్రిల్‌లో హెలికాప్టర్ దాడి నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో ఐఎస్ఐఎస్‌కు చెందిన అబ్ద్-అల్ హదీ మహ్మద్ అల్-హాజీ అలీని హతమార్చినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్

02

# గ్యాస్ బండలు, పాలు.. ఫ్రీ

## కర్ణాటకలో కమలం మ్యానిఫెస్టో

**బెంగళూరు :**

కర్ణాటక రాజకీయాలు వాడి వేడిగా సాగుతున్నాయి. అధికార పక్షం, ప్రతిపక్షాల విమర్శలు, ప్రతివిమర్శలతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఓటర్లను ఆకర్షించేందుకు అధికార, విపక్షాల నేతలు పరస్పరం విమర్శలు, ఆరోపణలు చేసుకుంటూ రాజకీయం చేస్తున్నారు.

02



# విడాకులకు 6నెలలు ఆగక్కర్లేదు

(మొదటిపేజీ తరువాయి)

విచారణ సందర్భంగా రాజ్యాంగ ధర్మాసనం నిర్ణయించింది. 'ప్రాథమిక హక్కుల దృష్ట్యా ఆర్టికల్ 142ని పరిగణనలోకి తీసుకోవాలి.. ఇది రాజ్యాంగ పరిధిని దాటి న్యాయస్థానం పూర్తి న్యాయం చేయడానికి అధికారం కలిగి ఉంటుంది' అని బెంచ్ పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం.. పెండింగ్‌లో ఉన్న ఏ విషయంలోనైనా పూర్తి న్యాయం చేయడానికి అత్యున్నత న్యాయస్థానం ఉత్తర్వులు, ఆదేశాల అమలుతో వ్యవహరిస్తుంది. ఈ కేసును ఏడేళ్ల కిందట ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి జస్టిస్ శివ కీర్తి సింగ్, జస్టిస్ ఆర్ భానుమతిల ధర్మాసనం సిఫార్సు చేసింది. దీనిపై రాజ్యాంగ ధర్మాసనం విచారణను గతేడాది సెప్టెంబరు 29న పూర్తిచేసి తీర్పును రిజర్వులో ఉంచింది. తాజాగా సోమవారం తీర్పు వెలువరించింది.

# తుని రైలు దహనం కేసు కొట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

పద్మనాభం, దాడిశెట్టి రాజా సహా పలువురు కీలక నేతలు నిందితులుగా ఉన్నారు. వీరంతా కోర్టు తీర్పుతో ఊపిరి పీల్చుకున్నారు. కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం పిలుపు మేరకు కాపులను బీసీల్లో చేర్చాలన్న నినాదంతో 2016 జనవరి 31న తునిలో నిర్వహించిన బహిరంగ సభలో వేలాది మంది కాపులు పాల్గొన్నారు. సభ అనంతరం అక్కడ అల్లర్లు చెలరేగాయి. విధ్వంస కాండ నెలకొంది. విశాఖ వైపు వెళ్తున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ పై దుండగులు దాడి చేశారు. పక్కా ప్రణాళిక ప్రకారం పెట్రోల్ తీసుకు వచ్చి తగులబెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించి అదే సమయంలో పలు ప్రభుత్వ, ప్రయివేటు ఆస్తులు దహనం అయ్యాయి. తుని రైల్వే స్టేషన్‌లో నిలిచి ఉన్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ పలు బోగీలు దగ్ధమయ్యాయి. ఈ కేసులో రైల్వే పోలీసులు మొత్తం 41 మందిపై కేసులు పెట్టారు. 18 మంది పోలీసు అధికారుల సాక్షాలు, ఆనాటి రైలులో ఉన్న ప్యాసెంజర్ల సాక్ష్యాలను రైల్వే కోర్టు నమోదు చేసింది. చివరికి సాక్ష్యాలు లేవని.. పోలీసులు సరైన విచారణ చేయలేదని తేల్చి కేసును కొట్టి వేసింది. ఈ కేసులో ప్రదానంగా కాపు రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు ముద్రగడ పద్మనాభం, రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, వన్ టీవీ ఎండీ మంచాల సాయిసుధాకరనాయుడు, సినీ నటుడు జీవీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, కాపు నాయకులు కల్వకొలను తాతాజీ, వాసిరెడ్డి ఏసుదాసు, నల్లా విష్ణుమూర్తి, ఆకుల రామకృష్ణ వంటి వారు ఉన్నారు. వారందరూ కేసు నుంచి బయట పడినట్లయింది. కాపుల బహిరంగ సభ సందర్భంగా జరిగిన అల్లర్ల నేపథ్యంలో జరిగిన విధ్వంసానికి అప్పటి టీడీపీ రాష్ట్ర ప్రభుత్వంలో పోలీసులు 329 కేసులు పలు సెక్షన్ల కింద నమోదు చేశారు. ఏపీ పోలీసులు నమోదు చేసిన కేసుల్లో 2016 నుంచి 2019 వరకు జరిగిన దర్యాప్తులో 153 కేసులు వరకు వీగిపోయాయి. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక 176 కేసులుకు 161 కేసులను వెనక్కు తీసుకుంది. 14 కేసులు మాత్రం కోర్టులో విచారణ కొనసాగుతోంది. వైసీపీ ప్రభుత్వం 161 కేసులు వరకు ఎత్తివేసినా కేంద్ర ప్రభుత్వం పరిధిలోని రైల్వే శాఖకు సంబందించిన కేసులు పలు సెక్షన్ల కింద రైల్వే పోలీసులు కేసులు నమోదు చేయగా ఈ కేసులు విచారణ చేశారు. అయితే ప్రయాణికుల భద్రతతో ముడిపడిన వ్యవహారం విషయంలో నిందితులు ఎవరో తేల్చకపోవడం.. అందర్నీ నిర్దోషులుగా విడుదల చేయడంతో మరి అసలు రైలుని ఎవరు తగలబెట్టారన్న ప్రశ్న వస్తోంది.

# శ్రమజీవుల త్యాగాలే పునాదిరాళ్లు - సీఎం కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్ పేర్కొన్నారు.కార్మిక, కర్షక, శ్రమ జీవులకు ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. కార్మిక, కర్షక సంక్షేమాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. చెమట చుక్కలను ధారపోసి పరోక్షంగా సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న అందరికీ శుభాకాంక్షలు. తరతరాలుగా కష్టజీవి శ్రమతోనే ప్రపంచంలో సంపద దృష్టి జరుగుతోంది. మహోన్నతమైన విశ్వమానవ సౌధానికి శ్రమజీవుల త్యాగాలే పునాదిరాళ్లు అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.కార్మికులు ప్రమాదం కారణంగా మరణిస్తే రూ. 6 లక్షలు ఆ కుటుంబానికి చెల్లిస్తున్నామని సీఎం తెలిపారు. 2014 నుంచి నేటి వరకు 4001 మంది బాధిత కుటుంబాలకు రూ. 223 కోట్లు చెల్లించాం. ప్రమాదం కారణంగా వైకల్యానికి గురైన రూ. 5 లక్షల చొప్పున 504 మంది కార్మికులకు రూ. 89 కోట్లు చెల్లించాం. కార్మిక కుటుంబంలోని ఇద్దరు ఆడపిల్లల పెండ్లికి రూ. 30 వేల చొప్పున వివాహ బహుమతి ఇస్తున్నాం అని కేసీఆర్ గుర్తు చేశారు. 2014 నుంచి నేటి వరకు 46,638 మంది లబ్ధిదారులకు రూ. 130 కోట్లు చెల్లించాం అని సీఎం తెలిపారు.మహిళా కార్మికులకు 2 కాన్పుల వరకు రూ. 30 వేల చొప్పున ప్రసూతి ప్రయోజనాలు అందిస్తున్నాం. 2014 నుంచి నేటి వరకు 1,01,983 మంది లబ్ధిదారులకు రూ. 280 కోట్లు చెల్లించాం. కార్మికులపై ఆధారపడిన 1,49,536 మంది లబ్ధిదారులకు రూ. 94 కోట్లు చెల్లించాం. మరణానంతరం అంతిమయాత్ర కార్యక్రమాలకు 39,797 మందికి రూ. 98 కోట్లు చెల్లించాం అని సీఎం కేసీఆర్ తెలిపారు.

# రేపు సిఎం జగన్ ఉత్తరాంధ్ర పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

బయలుదేరి ఐటీ హిల్స్ నెంబర్ 4లో గల వేదిక వద్దకు 2 గంటలకు చేరుకుంటారు. 2.30 ? 3.00 సమయంలో వైజాగ్ ఐటీ టెక్ పార్క్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ సందర్శిస్తారు, అనంతరం పారిశ్రామికవేత్తలతో నిర్వహించే కార్యక్రమంలో సీఎం ప్రసంగిస్తారు. తర్వాత 3.50 గంటలకు అక్కడినుంచి బయలుదేరి రుషికొండలో విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నివాసానికి చేరుకుంటారు. అక్కడ ఇటీవల వివాహం చేసుకున్న ఎంపీ కుమారుడు దంపతులను ఆశీర్వదిస్తారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు మధురవాడ హెలిప్యాడ్ నుంచి బయలుదేరి, 5.20 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. సాయంత్రం 5.30 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి 6.45 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.సుమారు 3,500 కోట్ల రూపాయలతో విశాఖ ఐటీ సెజ్ లోని హిల్ నెంబర్ 4 మీద నిర్మించనున్న వైజాగ్ టెక్ పార్క్ ( అదానీ డేటా సెంటర్) కు సీఎం జగన్ వచ్చే నెల మూడో తేదీన శంకుస్థాపన చేయనున్నారు. దీనికి సంబంధించి హిల్ నెంబర్ 3 మీద నిర్మిస్తున్న హెలిప్యాడ్ ను, హిల్ నెంబర్ 4 మీద నిర్మించనున్న డేటా సెంటర్ కు సంబంధించిన ఏర్పాట్లను వైవి సుబ్బారెడ్డి, రాష్ట్ర పరిశీల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ కలెక్టర్ మల్లికార్జున, నగర్ పోలీస్ కమిషనర్ తదితరులు శనివారం పరిశీలించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భోగాపురం ఎయిర్పోర్ట్ నిర్మిస్తామని చెప్పిందని, అన్నమాట ప్రకారమే వచ్చే నెల మూడో తేదీన ముఖ్యమంత్రి జగన్ ఏర్పోర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడమే కాకుండా, వెంటనే పనులు మొదలుపెట్టనున్నారని టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. అలాగే విశాఖ నగరానికి పేరు తెచ్చే విధంగా వైజాగ్ టెక్ పార్క్( అదానీ డేటా సెంటర్) నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేస్తారని ఆయన చెప్పారు. 134 ఎకరాలలో నిర్మిస్తున్న ఈ టెక్ పార్కు మూడు దశలలో ఏడేళ్లలో పూర్తి చేస్తామని సుబ్బారెడ్డి వివరించారు. ఈ టిక్ పార్క్ ద్వారా సుమారు 39 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని చెప్పారు.

# గ్యాస్ బండలు, పాలు.. ఫ్రీ

(మొదటిపేజీ తరువాయి)

తాము గెలిస్తే అది చేస్తామని, ఇది చేస్తామని, అవి ఉచితంగా అందిస్తాం అంటూ హామీలు గుప్పిస్తున్నారు. తాజాగా అధికార బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. ఈ మధ్యే వివాదానికి దారి తీసిన నందిని పాల బ్రాండ్ ను బీజేపీ రాజకీయంగా వాడుకుంది. మరోసారి బీజేపీని అధికారంలోకి తీసుకువస్తే ప్రతి రోజూ అర లీటరు నందిని పాలను ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే నిరుపేదలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వడంతో పాటు 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పుకొచ్చారు. ప్రజా ప్రణాళిక పేరుతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సోమవారం మేడే సందర్భంగా మేనిఫెస్టోను విడుదల చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, సీనియర్ నేత బీఎస్ యడియూరప్పలతో కలిసి జేపీ నడ్డా మేనిఫెస్టో ప్రకటించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల కలబోతగా బీజేపీ మేనిఫెస్టో ఉంటుందని తెలిపారు.

**బీజేపీ మేనిఫెస్టోలోని ప్రధాన హామీలు ఇవీ..**

- దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ప్రతి రోజూ అర లీటరు నందిని పాలు ఉచితం
- పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 కిలోల బియ్యం, 5 కిలోల తృణధాన్యాలతో నెలవారీ రేషన్
- దారిద్ర రేఖకు దిగువన ఉన్న వారికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం (ఉగాది, వినాయక చవితి, దీపావళికి ఒక్కోటి చొప్పున)
- తయారీ రంగంలో 10 లక్షల ఉద్యోగాల కల్పన
- కర్ణాటక ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తాం.
- ప్రతి వార్డులో అటల్ ఆహార కేంద్రాలు
- నిరాశ్రయులకు 10 లక్షల ఇళ్ల స్థలాల కేటాయింపు
- వృద్ధులకు ఉచితంగా వార్షిక హెల్త్ చెకప్ లు
- కర్ణాటక యాజమాన్య చట్టం సవరింపు, ప్రతి వార్డుకో లాబోరేటరీ
- మైసూరులోని ఫిల్మ్ సిటీకి దివంగత నటుడు పునీత్ రాజ్ కుమార్ పేరు
- బెంగళూరుకు స్టేట్ క్యాపిటల్ రీజియన్ ట్యాగ్
- ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఫిక్స్ డ్ డిపాజిట్ పథకం
- రూ.30 వేల కోట్ల మైక్రో కోల్డ్ స్టోరేజీ సదుపాయాల కల్పన
- రూ.1500 కోట్లతో పర్యాటక రంగం అభివృద్ధి
- ప్రముఖులతో కలిసి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విశ్వేశ్వరయ్య విద్యా యోజన
- ప్రతిభావంతులైన యువ నిపుణుల కోసం సమన్వయ పథకం ద్వారా నైపుణ్యాల కల్పన
- ప్రభుత్వ పోటీ పరీక్షల కోసం విద్యార్థులకు, యువతకు ఉచితంగా కోచింగ్
- మిషన్ స్వాస్థ్య కర్ణాటక ద్వారా రాష్ట్రంలో ప్రజారోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాల కల్పన
- మున్సిపల్ కార్పొరేషన్ లలోని ప్రతి వార్డులో రోగనిర్ధారణ సౌకర్యాలతో 'నమ్మ క్లినిక్'
- ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, 1000 స్టార్టప్ లకు మద్దతు, బీఎంటీఎస్ బస్సులను పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చడం
- బెంగళూరు శివారులో ఈవీ సిటీ నిర్మాణం

# ఐఎస్ ఉగ్రవాద సంస్థ చీఫ్ హతం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. సిరియాలో ఏప్రిల్ 16న కనీసం 41 మంది అనుమానిత ఐసిస్ ఉగ్రవాదులను హతమార్చారు. ఏప్రిల్ మొదటి వారంలో అమెరికా దళాలు ఐరోపాలో దాడులకు ప్రణాళిక వేసిన ఐఎస్ఐఎస్ నేత ఖలీద్ అయద్ అహ్మద్ అల్-జబౌరీని హతమర్చారు.ఇరాక్, సిరియా ప్రాంతాలను నియంత్రిస్తూ ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు ఐరోపాలో వరుస దాడులకు ఐఎస్ బాధ్యత వహించింది. అక్టోబర్ 2019లో వాయువ్య సిరియాలో జరిగిన ఆపరేషన్‌లో ఐఎస్ అబూ బకర్ అల్-బాగ్దాదీని చంపినట్లు వాషింగ్టన్ పోస్ట్ ప్రకటించింది. ఒకప్పుడు నియంత్రించిన చాలా భూభాగం నుంచి తరిమివేసినా ఇప్పటికీ ఐఎస్ సిరియాలో దాడులను ప్రారంభించింది.

# విశాఖ లో బిజెపి నేతలు హౌస్ అరెస్టు

**విశాఖ**

వైసీపి ప్రభుత్వం పర్యాటక కేంద్రాలకు పేర్లు మార్చే పనిలో పడింది ఇదేమిటని ప్రశ్నిస్తే హౌస్ అరెస్టులకు దిగుతోందని బీజేపీ నేతలు ఆరోపించారు. పాలక పార్టీకి అధికారులు తందానా తానా అనడంతో ప్రభుత్వానికి పైత్యం ప్రకోపించి పిచ్చి పదిరకాలు అన్నచందంగా వ్యవహరిస్తోందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఉన్న సీత కొండ కు వైఎస్ఆర్ వ్యూ పాయింట్ గా నామకరణాన్ని చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఉధ్యమానికి పిలుపునిస్తే విశాఖ పోలీసులు బిజెపి నేతలను హౌస్ అరెస్టు చేశారని ప్రభుత్వం పై మాధవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభత్వం సంక్షేమ, అభివృద్ధి పధకాలకు స్టిక్కర్లు వేసుకోవడానికి అలవాటు పడి సీత కొండ కు పేరు మార్చేసింది ముఖ్యమంత్రి ఈ రాష్ట్రానికి శాశ్వత సిఎం అనుకుంటున్నారా అని మాధవ్ ఎద్దేవా చేశారు. వైఎస్ ఆర్ వ్యూ గా పేరు మార్చడంతో స్థానికులు ప్రభుత్వాన్ని అసహ్యంచు కుంటున్నారన్నారు. పభుత్వ పెద్దల మెప్పుకోసం అధికారులు నిభంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ముఖ్య మంత్రి కి పిచ్చి పరాకాష్టకు చేరి రాష్ట్రంలో ని అన్ని జిల్లాలకు వైఎస్ ఆర్ పేరుగా మార్చి రాష్ట్రానికి కూడా మార్చుకుంటారా అని ప్రశ్నించారు.

# ఎలక్ట్రిక్ బస్సులతో పర్యావరణ పరిరక్షణ

**బద్వేలు**



ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు సోమవారం ప్రారంభించారు. కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణలో 12 విద్యుత్తు ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ ఛైర్మన్ ఏ. మల్లిఖార్జునరెడ్డి ప్రారంభించారు. కడప, తిరుపతి నుంచి ఉదయం 4.30 గంటలకు తొలి బస్సు, రాత్రి 7.30 గంటలకు చివరి బస్సు నడపనున్నారు కాలుష్యం తగ్గించేందుకు తన వంతు బాధ్యతగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ఈరోజు ఈ ఎలక్ట్రానిక్ బస్ లను ప్రారంభించడం జరిగిందన్నారు.ప్రజలకు సరైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టాము అన్నారు. రాష్ట్రంలోని అన్ని డిపోలలో త్వరలో ఎలక్ట్రానిక్ బస్సులను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆర్టిసి ఉన్నతాధికారులు కార్మికులు పాల్గొన్నారు

# ఆర్ జోన్ పై హైకోర్టులో విచారణ

**విజయవాడ,:**



అమరావతి పరిధిలో ఆర్ - 5 అనే జోన్ ఏర్పాటు విషయంలో దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో నేడు విచారణ జరిగింది. ఆర్-5 జోన్ పేరుతో రాజధాని పరిధిలో బయటి వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని హైకోర్టులో రైతులు సవాలు చేశారు. అయితే, రాజధానిలో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారు లకు అందజేయకుండా ఇళ్ల పట్టాల పంపిణీ చేయడంపై ప్రభుత్వానికి తొందర ఎందుకని పిటిషనర్‌లు అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టుకు వెళ్లారు. అయితే, టిడ్కో ఇళ్ళ వ్యవహారంలో ప్రభుత్వం, పిటిషనర్లు ఎలాంటి వివరాలు అందజేయకపోవడంతో.. రాజధాని పరిధిలో నిర్మించిన 5 వేల టిడ్కో ఇళ్ళ లబ్ధిదారుల వివరాలు, ఇళ్ళ మంజూరుకు అనుసరించిన విధానాలకు సంబంధించి పూర్తి నివేదికను ధర్మాసనానికి సమర్పించాలని హైకోర్టు సూచించింది. ఆ తర్వాత వాదనలు వినిపించేందుకు సిద్ధమై రావాలని ఇరు వర్గాలకు హైకోర్టు సూచించింది. దీనిపై విచారణను రేపటికి (మే 2) కి వాయిదా వేసింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందిన పేద వారికైనా రాజధాని అమరావతిలో 1,134 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గుంటూరు (550.65ఎకరాలు), ఎన్టీఆర్ (583.93 ఎకరాలు) జిల్లా కలెక్టర్లకు భూబదలాయిపు కోసం సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతిస్తూ పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై. శ్రీలక్ష్మి ఈ ఏడాది మార్చి 31న జీవో 45 జారీ చేశారు. ఆ జీవోను సవాలు చేస్తూ రాజధాని ప్రాంత రైతులు యు. శివయ్య, కె.రాజేశ్, బెజవాడ రమేశ్ బాబు, ఆలూరి రాజేశ్, కుర్రా బ్రహ్మ, కట్టా రాజేంద్రవర ప్రసాద్ హైకోర్టులో వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఆయా పిటిషన్లపై ఉన్నత న్యాయస్థానం నేడు విచారణ చేపట్టింది.

# కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజ్

**హైదరాబాద్ :**

వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. మొత్తం 40 విభాగాల్లో 5,544 కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు ఆదివారం (ఏప్రిల్ 30) ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో పని చేస్తున్న జూనియర్, సీనియర్ ఇన్?స్ట్రక్టర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, ఫార్మసిస్టులు, ల్యాబ్? టెక్నీషియన్లు, లేబర్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్లను క్రమబద్ధీకరిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొంది.

కాగా 11,103 పోస్టుల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్?చేస్తామని 2022 మార్చిలోనే సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇప్పటికే వీరిలో సగం మందిని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. మిగిలిర మరో సగం మందికి సంబంధించిన జీవోలను మాత్రం పెండింగ్‌లో ఉంచింది. ఏప్రిల్ నుంచి కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అంతర్గత కారణాల రిత్య అమలుకు నోచుకోలేదు. తాజాగా క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ కావడంతో కాంట్రాక్టు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పారిశుధ్య పనుల్లో అధికారులు

**తిరుమల :**

ఒకరు నిత్యం తిరుపతి జిల్లా పాలనా వ్యవహారాలతో బిజీగా ఉండే కలెక్టర్ వెంకటరమణారెడ్డి. మరొకరు తిరుమలకు వచ్చే వేలాది మంది భక్తులకు దర్శనాలు, ఇతర సౌకర్యాలు కల్పించడంలో హడావుడిగా ఉండే టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వీరిద్దరూ ఆదివారం చీపురు పట్టారు. మానవ సేవే మాధవ సేవగా భావించి శ్రీవారి దర్శనార్థం తిరుమల కు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొండపై పారిశుధ్య పనుల్లో నిమగ్నమయ్యారు. పారిశుధ్య కార్మికుల్లా మారి రోడ్లు ఊడ్చి, చెత్త ఎత్తారు. ఈవో అయితే మరుగుదొడ్లనూ శుభ్రం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ తిరుమలలో పనిచేసే దాదాపు 1,600 మంది సులభ్ కార్మికులు ఏప్రిల్ 22వ తేదీ నుంచి సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. దాంతో వారం రోజులుగా తిరుపతి కార్పొరేషన్‌లో పనిచేసే ఉద్యోగులతోనే పారిశుధ్య పనులను టీటీడీ చేయిస్తోంది.

ప్రజాతపన
prajathapana.com

# కర్ణాటకలో ఆరు రాష్ట్రాల ఓటర్లు

**బెంగళూరు:**

మే 10వ తేదీన పోలింగ్ జరగబోతున్న కర్నాటక అసెంబ్లీ ఎన్నికల పర్వం ఆసక్తికరమైన మలుపులు తిరుగుతోంది. అదే సమయంలో అత్యధిక మొత్తాల్లో నగదు, వస్తువులు స్వాధీనం అవుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఇప్పటికే దాదాపు రెండున్నర రెట్లు అధికంగా సొమ్ము అధికారులు సీజ్ చేశారు. ఏప్రిల్ 29వ తేదీ నాటికి ఎన్నికల అధికారులు సీజ్ చేసిన నగదు, వస్తువుల విలువ 302 కోట్ల రూపాయలుగా తేలింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ తేదీకి పది రోజుల ముందుగా లభ్యమైన 115.9 కోట్ల రూపాయలతో పోలిస్తే.. తాజా ఎన్నికల్లో పోలింగ్‌కు పది రోజుల ముందు లభ్యమైన మొత్తం దాదాపు రెండున్నర రెట్లు ఉంటుంది. ఈ లెక్కన కర్నాటక ఎన్నికల్లో ధన ప్రవాహం కొనసాగుతుందో అంచనా వేయవచ్చు. ఈ ధన ప్రవాహానికి కారణం అక్కడ బిజెపి, కాంగ్రెస్ పార్టీలు నువ్వా నేనా అన్న విధంగా తలపడుతున్నాయి. ప్రజలు కూడా గత ఐదేళ్ల రాజకీయపరమైన మార్పులు చేర్పులు, వ్యూహ ప్రతి వ్యూహాలను దృష్టిలో పెట్టుకొని ఈసారి తీర్పు చెప్పే సంకేతాలు కనిపిస్తున్నాయి. దాంతో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు అభ్యర్థులు యధాశక్తి ప్రయత్నం చేస్తున్నారు. దాని ఫలితమే అధికారుల దాడుల్లో లభ్యమవుతున్న భారీ డబ్బు మూటలు.ఈ సంగతి ఇలా పక్కన పెడితే కన్నడ నాట జరుగుతున్న ఎన్నికలలో పొరుగు రాష్ట్రాల ప్రజలు నాయకుల ఇన్ఫ్లుయెన్స్ కూడా బాగానే కనిపిస్తుంది. జియోగ్రాఫికల్‌గా చూస్తే కర్నాటక రాష్ట్రానికి ఒక స్పెషాలిటీ ఉంది. కర్నాటక రాష్ట్రం ఆరు రాష్ట్రాలతో సరిహద్దులను కలిగి ఉంది. దక్షిణాన కేరళ, ఆగ్నేయంలో తమిళనాడు, తూర్పున ఆంధ్రప్రదేశ్, ఈశాన్యాన తెలంగాణ, ఉత్తరాన మహారాష్ట్ర, పశ్చిమాన గోవా రాష్ట్రాలతో కర్నాటక సరిహద్దులు కలిగి ఉంది. దీని కారణంగా మరే రాష్ట్రంలో లేనంతగా కర్నాటక రాజకీయాలపై ఇతర భాషలు మాట్లాడే ప్రజల ప్రభావం కనిపిస్తుంది. కన్నడేతర జనాభా అధిక సంఖ్యలో ఉండటం రాష్ట్రంలో ఆయా వర్గాల రాజకీయ ప్రాతినిధ్యానికి బీజం వేసింది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో వివిధ పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్‌లు కలిపి వంద మందికి పైగా తెలుగు వ్యక్తులు పోటీ చేస్తున్నారు. అదే సమయంలో మరాఠా మూలాలు ఉన్నవారు 50 మందికిపైగా బరిలో ఉన్నారు. తమిళులు కూడా మరో పదిమంది ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. కర్నాటకలో కన్నడ, ఉర్దూ భాషల తర్వాత అత్యధికంగా మాట్లాడే భాష తెలుగు. ఆంధ్రప్రదేశ్‌కు బార్డర్ కలిగి ఉన్న బళ్లారి, చిత్రదుర్గ, తుమ్‌కూరు, పావగడ, కోలార్, చిక్కబల్లాపూర్ లాంటి ప్రాంతాలలో తెలుగు మాట్లాడేవారు అధిక సంఖ్యలో ఉన్నారు. ఒకప్పుడు హైదరాబాద్ సంస్థానంలో భాగమైన బీదర్, కలబురిగి, యాద్గిర్, రాయచూర్ జిల్లాల్లో కూడా తెలుగు మాట్లాడే వ్యక్తులు అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ నాలుగు జిల్లాలు తెలంగాణ సరిహద్దులో ఉన్నాయి. దాంతో భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణ నేతలతో అక్కడ ప్రచారానికి ప్రణాళిక రచించారు.. అమలు చేస్తున్నారు. ఇక కోలార్, బెంగళూరు అర్బన్, రామనగర, చామరాజనగర జిల్లాల్లో తమిళ భాష మాట్లాడే వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. దక్షిణ కర్నాటకలోని మైసూరు, కొడగు, చామరాజనగర, దక్షిణ కన్నడ జిల్లాల్లో మలయాళీలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. గోవా సరిహద్దులోని ఉత్తర కర్నాటక, బెళగావి జిల్లాల్లో కొంకణి భాష మాట్లాడే వారు కనిపిస్తారు. మహారాష్ట్ర సరిహద్దులోని బెళగావి, విజయపుర, కలబురిగి, బీదర్ జిల్లాల్లో మరాఠా భాష మాట్లాడే వారు కూడా ఉన్నారు. అయితే కొన్ని దశాబ్దాలుగా కర్నాటక అసెంబ్లీకి తెలుగు సహా ఇతర భాషలు మాతృభాషగా కలిగి ఉన్నవారు ఎన్నిక అవుతున్నప్పటికీ వారు తమ మూలాలను వెల్లడించేందుకు ఇష్టకపడకపోవడం గమనార్హం. ఎందుకంటే అవి వెల్లడిస్తే తమ రాజకీయ ఎదుగుదల దెబ్బతింటున్నది వారి భావన.ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో మిగిలిన రాష్ట్రాల ప్రభావం ఎలా ఉన్నప్పటికీ మహారాష్ట్ర ఏకీకరణ సమితి చేసిన రగడ ప్రభావం ఎంతో కొంత ఉండే అవకాశం కనిపిస్తుంది. మహారాష్ట్రకు సరిహద్దులోని బెళగాలి జిల్లాలో మరాఠాల ప్రభావం కాస్త ఎక్కువ. బెళగావిని మహారాష్ట్రలో కలపాలని డిమాండ్ చేస్తున్న మహారాష్ట్ర ఏకీకరణ సమితికి ఆ ప్రాంతంలో గట్టిపట్టే ఉంది. 1957 నుంచి కర్నాటక అసెంబ్లీకి మహారాష్ట్ర యోగీకరణ సమితి వారు ఎన్నికవుతూ వస్తున్నారు. ఇక దక్షిణాన ఉన్న కోలార్ గోల్డ్ ఫీల్డ్ నుంచి 2004 వరకు గెలిచిన ఎమ్మెల్యే లలో తమిళులే ఎక్కువ. ప్రస్తుత ఎన్నికల్లో పులకేశినగర్ నుంచి అంబరాసన్ ఏడీఎంకే తరఫున పోటీకి దిగారు. కానీ బిజెపి నాయకుల విజ్ఞప్తి మేరకు ఆయన వైదొలిగారు. మరికొన్ని ప్రాంతాలలో తెలుగు, మరాఠీ, తమిళ మూలాలున్న నేతలు వివిధ పార్టీల తరఫున పోటీ పడుతున్నారు. కానీ వారు వివాదాస్పద అంశాల జోలికి వెళ్లకుండా స్థానిక అంశాల ప్రస్తావనతోనే ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు.మైసూరు తొలి సీఎం తెలుగోడేచరిత్రను ఒకసారి పరిశీలిస్తే.. 1947లో ఉన్న మైసూరు రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి తెలుగు వాడే కావడం విశేషం. 1947లో మైసూరు రాష్ట్రానికి తెలుగువాడైన క్యాసంబల్లి చంగల్రాయ రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేశారు. కర్నాటక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కన్నడ రాజకీయాలలో తెలుగువారు చురుకుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. తాజాగా శ్రీనివాస్ పూర్ నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కె.ఆర్. రమేష్ కుమార్, కర్నాటక అసెంబ్లీ స్పీకర్‌గా రెండు దఫాలుగా పని చేశారు. 1994 నుంచి 99 వరకు, తిరిగి 2018 నుంచి 2019 వరకు రమేష్ కుమార్ స్పీకర్‌గా వ్యవహరించారు. ఇక కర్నాటక రాజకీయాలలో పెను సంచలనం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనుల వ్యవహారంలో వివాదాస్పద బిజినెస్‌మన్ అయిన గాలి జనార్దన్ రెడ్డి, ఆయన కుటుంబీకులు శాసనసభకు ఎన్నికవుతూ వస్తున్నారు. జనార్దన్ రెడ్డి రాష్ట్ర మంత్రిగా కూడా వ్యవహరించారు. ఆయన సోదరుడు కరుణాకర్ రెడ్డి, ఆయన స్నేహితుడు శ్రీరాములు, కట్ట సుబ్రహ్మణ్యం నాయుడు కర్నాటక మంత్రులుగా వ్యవహరించారు. గాలి జనార్దన్ రెడ్డి మరొక సోదరుడైన సోమశేఖర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. వీరే కాకుండా జయనగర బీటీఎం లేఅవుట్ నుంచి ఏడుసార్లు నెగ్గిన డి.రామలింగారెడ్డి గత ఎన్నికల్లో గెలిచిన సౌమ్యా రెడ్డి మరోసారి ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. 2018 శాసనసభ ఎన్నికల్లో తెలుగువారు ఏకంగా 20 మంది కన్నడ అసెంబ్లీకి ఎన్నికవ్వడం విశేషం. దాంతో ప్రస్తుత ఎన్నికల్లో కూడా తెలుగు, తమిళ, మలయాళ, మరాఠా, కొంకణి ప్రజల ప్రభావం ఖచ్చితంగా పడే సంకేతాలు కనిపిస్తున్నాయి.

# రేవంత్ తో చేతులు కలిపిన జానారెడ్డి

**హైదరాబాద్ :**



కాంగ్రెస్‌లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి రాక సందర్భంగా నల్గొండ జిల్లా కాంగ్రెస్ నేతలంతా ఏకతాటిపైకి వచ్చారు. గతంలో తమకు సమాచారం లేదని కీలక నేతలు వాయిదా వేయించిన నిరుద్యోగ నిరసన ర్యాలీ సభను శుక్రవారం నిర్వహించారు. ఎంపీలు ఉత్తమ్? కుమా ర్?రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. జిల్లా అగ్రనేతలు అందరూ రేవంత్? సభలో పాల్గొనడం, ఆయనకు అండగా ఉంటామని స్పష్టం చేయడం పార్టీ కేడర్?లో జోష్? నింపింది. ఎంపీలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వెంకట్ రెడ్డి సొంత నియోజకవర్గాల ఎమ్మెల్యేలను టార్గెట్ చేసి రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించడం ఆసక్తికరంగా మారింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జానారెడ్డి చేసిన కృషిని వివరించడమేగాక, మంత్రి పదవి త్యాగం చేసిన వెంకట్ రెడ్డిని కొండా లక్ష్మణ్ బాపూజీతో పోల్చారు. పౌరషం కలిగిన వ్యక్తి దామోదర్ రెడ్డి అని కీర్తించడ మేగాక, సూర్యాపేట నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర మంత్రి జగదీశ్ రెడ్డిని టార్గెట్ చేసి ఆయన చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి. నల్గొండలో రేవంత్ సభను సక్సెస్ చేయడంలో జానారెడ్డి కీలక పాత్ర పోషించారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలందరని ఏకతాటికి పైకి తీసుకొచ్చే బాధ్యతను జానారెడ్డి భుజానెత్తుకున్నారు. ఇదే రకమైన పంథాను ఎన్నికల్లోనూ కొనసాగుతుందని జానారెడ్డి అన్నారు. పార్టీ గెలుపు కోసం, తాను సమైఖ్య యోధుడిగా పాటుపడతానని చెప్పడం విశేషం. ఇదిలా ఉండగా తామంతా కలిసికట్టుగానే ఉన్నామని, చిన్న మనస్పర్ధలు ఉన్నా వాటిన్నింటిని పక్కన పెట్టి వచ్చే ఎన్నికల్లో కలిసి కట్టుగా పనిచేస్తామని ఎంపీ వెంకట్ రెడ్డి సైతం రేవంత్‌కు మద్దతు తెలిపారు. ప్రధాని మోడీని కలినంత మాత్రాన బీజేపీలో చేరినట్టుకాదని, అట్లాగే రేవంత్ నల్గొండకు రానంత మాత్రాన తాను అడ్డు చెప్పినట్టు కాదని, పరి స్థితులను బట్టి తామే రేవంత్ ను నల్గొండకు ఆహ్వానిద్దామని అనుకున్నా మని వెంకట్?రెడ్డి వివరణ ఇచ్చారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి మరో అడుగు ముందుకేసి వచ్చే ఎన్నికల్లో 12 సీట్లు గెలిచి సాధిస్తామన్నారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు సైతం పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, అందరూ కలిసికట్టుగానే ఉన్నామని చెప్పారు. మొత్తం మీద ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షులు ఈ సభకు రావడం, అన్ని నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేయడం పార్టీలో కొత్త ఊపు తీసుకొచ్చింది. దీంతో సీనియర్లు అంతా మరోసారి ఏకమయినట్లు అంది. అయితే జగ్గారెడ్డి మాత్రం వరుసగా లేఖలు విడుదల చేస్తూ.. తాను అసంతృప్తిగానే ఉన్నానని సంకేతాలు పంపుతున్నారు. తాజాగా పాదయాత్రకు అనుమతి కోరుతూ లేఖ కూడా రాశారు.

# హ్యాట్రిక్ కోసం..కసరత్తులు

**హైదరాబాద్ :**

ఎన్నికలు సమీపిస్తుండగా సర్కార్ అలర్టైంది. బీఆర్ఎస్(టీఆర్ఎస్)హ్యాట్రిక్ కొట్టాలని పావులు కదుపుతున్నది. మెజార్టీ ప్రజల మైండ్ ను మార్చి ఓట్లు రాల్చుకోవాలని వ్యూహాలు పన్నుతుంది. ఇందులో భాగంగా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందినోళ్లను టార్గెట్ చేసింది. ఓటర్ లిస్టును పరిశీలిస్తూ సర్కార్ నుంచి స్కీమ్ లు పొందిన లబ్ధిదారుల వివరాలను గుర్తించనుంది. ఏ స్కీమ్ నుంచి లబ్ధిపొందారు? ప్రభుత్వంపై వాళ్లకు ఉన్న ఆలోచన ఏమిట ి? ఆ ఇంట్లో ఓటర్లు ఎందరు ఉన్నారు? వంటి వివరాలన్నింటినీ సేకరించనుంది.ఇప్పటికే బీఆర్ఎస్ హై కమాండ్ నుంచి క్షేత్రస్థాయి లీడర్లకు ఆదేశాలు అందాయి. నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా కమిటీలు వేయనుంది. ఇవి అన్ని స్కీముల లబ్ధిదారుల వివరాలు సేకరిస్తాయి. ఇప్పటికే వెల్ఫేర్, ఇతర డిపారెంట్ల ఆఫీసర్లకు డేటా అంశంపై సర్కార్ అంతర్గతంగా ఆదేశాలిచ్చినట్లు తెలుస్తున్నది. ప్రతి బెనిఫియర్ సామాజికవర్గం, ఫోన్ నంబర్లతో సహా రిపోర్టులు తయారు చేయనున్నట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఓ బీఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ తెలిపారు.బెనిఫియర్లపై మరింత ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేయనున్నది. ఈ ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్ కు ఓటు వేయాలని క్షేత్రస్థాయిలో కేడర్ కోరనున్నది. ఈసారి గెలిస్తే మీకు మరింత మేలు జరుగుతుందని.. స్కీమ్ లబ్ధిదారులకు సూచించనున్నారు. అవసరమైన పార్టీ పెద్దల నుంచి కూడా బెనిఫియర్లకు ఫోన్లు చేపించాలని పార్టీ ప్లాన్ చేసింది. దీనిలో భాగంగా జిల్లాకో టెలీ యూనిట్ టీమ్ లను ఎన్నికల కొరకు వాడనున్నారు. బీఆర్ఎస్ ఆఫీసులో వీళ్లకు ట్రైనింగ్ తో పాటు టాస్క్ నిమిత్తం ప్రత్యేక సౌకర్యాలను కూడా కల్పించనున్నారుప్రభుత్వం నుంచి లబ్ధిపొందినోళ్లు తప్పనిసరిగా బీఆర్ఎస్ కు ఓటు వేస్తారనే భావనలో ప్రభుత్వం ఉన్నది. సాయం పొందినోళ్లు సర్కార్ కు అండగానే ఉంటారని ప్రభుత్వం ఫీల్ అవుతున్నది. అయితే పార్టీ నుంచి పదే పదే గుర్తు చేయడంతో బీఆర్ఎస్ గుర్తును మరిచిపోరనే భ్రమలో బీఆర్ఎస్ హై కమాండ్ ఆలోచిస్తున్నది. కల్యాణలక్ష్మి, ఆసరా, ఎంపర్‌మెంట్, తదితర స్కీమ్‌లు లబ్ధిదారులకు సర్కార్ నేరుగా ఆశ్రయించనున్నట్లు తెలుస్తుంది. దీంతో పాటు యువత, నిరుద్యోగులను ఆకర్షించేందుకు కూడా ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నట్లు బీఆర్ఎస్ ఇన్ చార్జి ఒకరు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో బీఆర్ఎస్ అరవైకి పైగా సీట్లు సాధించగా, రెండో విడత ఎనభై కి పైగా.. మూడోసారి వంద సీట్లు టార్గెట్ గా ప్రభుత్వం లక్ష్యం పెట్టుకొని ముందుకు సాగుతున్నది. అయితే ప్రభుత్వం వేసిన ఈ ప్లాన్ వర్కవుట్ అవుతుందా? లేదా? అనేది వేచి చూడాలి.

# ఇక నుంచైనా...అందుబాటులో ఉంటారా..?

**హైదరాబాద్:**

ముఖ్యమంత్రి కేసీఆర్ తాను కోరుకున్న విధంగా కొత్త సచివాలయాన్ని నిర్మించుకున్నందున ఇకపైన పాలన మొత్తం ఈ భవనం నుంచి అందిస్తారా? లేక మూణ్ణాళ్ళ ముచ్చటకే పరిమితం చేస్తారా? అనే చర్చ మొదలైంది. అధికారులు, సిబ్బంది మధ్య భిన్నమైన రీతిలో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయం మొత్తం సచివాలయానికి తరలిరావడంతో సీఎం కూడా కచ్చితంగా వస్తారని అధికారులు బలంగా నమ్ముతున్నారు.కోరుకున్న రీతిలో సచివాలయ భవనం నిర్మాణమైనందున పూర్తి సంతృప్తితో ఉన్నారని, రెగ్యులర్‌గా రావడానికే అవకాశాలున్నాయని ఆఫీసర్లు వ్యాఖ్యానించారు.మరో వైపు ఎన్నికల సంవత్సరం కావడంతో ఎప్పటికప్పుడు పథకాల సమీక్ష, గతంలో ఇచ్చిన హామీల అమలు, మార్గదర్శకాల రూపకల్పన తదితరాలన్నింటినీ లోతుగా స్టడీ చేస్తూ అవసరమైన రిపోర్టులను తెప్పించుకునే పనులు ఎక్కువగా ఉంటాయని గుర్తుచేశారు. గతంలోనైతే ప్రగతి భవన్ కేంద్రంగా పాలన సాగినందున అధికారులంతా రిపోర్టుల్ని తీసుకునే అక్కడికే వెళ్ళాల్సి వచ్చేదన్నారు.జిల్లా స్థాయిలో వెల్ఫేర్ స్కీమ్‌లు సీఎం కోరుకున్న విధంగా అమలవుతున్నాయో లేదో తరచూ కలెక్టర్లతోనే డైరెక్టుగా మాట్లాడి రిపోర్టులు తెప్పించుకుంటారని, సచివాలయానికి వచ్చిన తర్వాత పాలనలో ప్రత్యేక



తేడా కనిపిస్తుందనే అభిప్రాయాన్ని ఐఏఎస్, ఐపీఎస్ స్థాయిలో కలిగించేందుకు సీఎం తరచూ సెక్రటేరియట్‌కు రావడానికే మొగ్గు చూపుతున్నారని మరో అధికారి వ్యాఖ్యానించారు. కానీ, ఎన్జీవో ర్యాంక్ సిబ్బందిలో మాత్రం మరో రకమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మూణ్ణాళ్ళ ముచ్చటగానే మిగిలిపోతుందని, వారానికి రెండు మూడు రోజులకు పరిమితం చేసి ఎన్నికల వేడి మొదలుకాగానే ప్రగతి భవన్‌కే పరిమితమవుతారని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ఇకపైన రెగ్యులర్‌గా సెక్రటేరియట్‌కు వస్తాననే విషయాన్ని నొక్కిచెప్పలేదనే అంశంపై కొద్దిమంది సిబ్బంది స్పందిస్తూ, వాస్తవానికి తొలుత తయారైన స్పీచ్ వేరేగా ఉందని పేర్కొన్నారు. పాత సచివాలయాన్ని కూలగొట్టడంపై వచ్చిన విమర్శలపైనే ఎక్కువ దృష్టి పెట్టి కొత్త భవనాన్ని అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకున్నామనే అంశాన్ని చెప్పదల్చుకున్నారని, దాన్ని బట్టే వారికి విమర్శించే అవకాశం లేకుండా ఫోకస్ పెట్టారని గుర్తుచేశారు. ప్రతీ రోజు రాకపోయినా వారానికి మూడుసార్లయినా వస్తారనేది ఆఫీస్ సెటప్‌ను చూసిన తర్వాత అర్థమవుతుందని పేర్కొన్నారు. అనేక వెల్ఫేర్ స్కీమ్‌ల అమలు పెండింగ్‌లో పడడంతో ప్రజల్లో ఏర్పడిన అసంతృప్తిని తగ్గించేలా ఇకపైన పాలన మీద దృష్టి పెట్టడం కోసం సచివాలయానికి రావడం ఒక అవసరమన్న అభిప్రాయామే ఎక్కువ మంది ఉద్యోగుల నుంచి వ్యక్తమవుతున్నది.సచివాలయానికి వచ్చే అలవాటే లేని కేసీఆర్ కొత్త భవనాన్ని కట్టుకున్నా ప్రయోజనమేంటంటూ ఇప్పటికే విపక్ష నేతలు విమర్శించారు. ముఖ్యమంత్రి ఎక్కడుంటే అక్కడే సచివాలయం అని గతంలో అధికార పార్టీ నేతలు చెప్పిన అంశాన్ని పలువురు గుర్తుచేశారు. రెగ్యులర్‌గా సెక్రటేరియట్‌కు సీఎం వస్తే సిబ్బందిలో స్పష్టమైన తేడా కనిపిస్తుందని, ఆఫీసర్ల స్థాయిలో తీసుకునే నిర్ణయాల్లో, పెండింగ్ ఫైళ్ళను ఎప్పటికప్పుడు క్లియర్ చేయడంలో, అన్ని వివరాలను సమగ్రంగా రూపొందించడంలో.. అన్ని దశల్లోనూ ఒక భయం, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ముఖ్యమంత్రి హాజరుకాకపోతే అధికారుల్లోనూ అలసత్వం, నిర్లక్ష్యం ఉంటుందని, ఆ ప్రభావం రొటీన్ కార్యకలాపాలపై కనిపిస్తుందని గుర్తుచేశారు. ఎవరికెన్ని సందేహాలున్నా సీఎం ఇకపైన రెగ్యులర్‌గా వస్తారా లేదా అనేదానికి కొన్ని రోజుల తర్వాతనే క్లారిటీ వస్తుందన్నారు.

# గీత కార్మికుని కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించిన డిఎస్పి కృష్ణయ్య

**సూర్యాపేట**

సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం లోని చిలుకూరు గ్రామంలో గత కొన్ని రోజుల క్రితం తాటి చెట్టు పై నుండి పడి అకాల మరణం చెందిన రామారావు కుటుంబాన్ని పరామర్శించిన డి.ఎస్.పి అమరగాని కృష్ణయ్య. చిలుకూరు గ్రామంలో ఈనెల 13వ తారీఖున వృత్తి రీత్యా కల్లు గీయడానికి వెళ్లి చెట్టు పై నుండి పడి మరణించిన విషయం అందరికీ తెలిసిందే. రామారావు కుటుంబం కల్లు గీత వృత్తినే నమ్ముకొని జీవించేటటువంటి కుటుంబం ఎటువంటి ఆస్తులు లేవు. రామారావుకు ఇద్దరు పిల్లలు కుమార్తె, కుమారుడు ఉన్నారు. రామారావు మరణంతో కుటుంబంలో పెద్ద దిక్కున కోల్పోయారు, జీవనాధారం కష్టంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని చిలుకూరు గ్రామంలో ఉన్న యువకులు , గౌడ్ ఉద్యోగస్తులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, సోషల్ మీడియా ద్వారా దాదాపు 5 లక్షల రూపాయలు వసూలుచేసి ఈరోజు రామారావు కుటుంబానికి అందజేయడం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిఎస్పి అమరుగాని కృష్ణయ్య మాట్లాడుతూ, సమాజంలో కష్టమైన కులవృత్తి గౌడుల వృత్తి అన్నారు. ప్రతిరోజు సుమారు 30 అడుగుల తాటి చెట్లను ఎక్కి కల్లు గీయడం అనేది కష్టమైనా పని ప్రమాదకరమైన వృత్తి అన్నారు. గౌడ కులస్తుల జీవన ఆధారం కల్లు గీయడమే కాబట్టి తప్పనిసరి అవుతుందని ,తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గౌడ కులస్తులు తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలని, కోదాడ నియోజకవర్గం లోని లైసెన్సు కు అయ్యే ప్రతి గీత కార్మికుడి ఖర్చును అమర గాని ఫౌండేషన్ ద్వారా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. రామారావు కుటుంబానికి 25 వేల రూపాయల చెక్కును అందజేస్తూ, అమరగాని ఫౌండేషన్ ద్వారా 5000 రూపాయల నగదు ఇవ్వడం జరిగింది. కొండా రాంబాబు కానిస్టేబుల్ ఐదువేల రూపాయల నగదు ఇచ్చారు. కొల్లు కోటేశ్వరరావు పదివేల రూపాయలు నగదు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా మండవ వీరబాబు సోషల్ మీడియా ద్వారా వచ్చిన డబ్బులు, ఉపాధ్యాయ సంఘం ద్వారా వచ్చిన డబ్బులు ఈరోజు రామారావు కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎక్సైజ్ ఎస్సై సైదులు, మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి అన్నదాన సత్రం అధ్యక్షుడు బెల్లంకొండ రాములు, ఎంపీటీసీ బెల్లంకొండ రమణ నాగయ్య, పెండెం వెంకటేశ్వర్లు, బంధం వెంకటేశ్వర్లు, సురగాని లింగయ్య, కొండా వెంకన్న, కొండ వీరబాబు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, బురా వెంకటేశ్వర్లు, మరీదు సైదులు, బండి కాశయ్య, సొందు , ఫాష ,లింగరాజు స్నేహితులు బంధుమిత్రులు పాల్గొన్నారు.

# పార్టీ కార్యాలయంలో మే డే వేడుకలు

**పాలేరు**

పాలేరు లోనే వైఎస్సార్ టీపీ పార్టీ కార్యాలయంలో సోమవారం మే డే వేడుకలు జరిగాయి. పార్టీ అధినేత్రి షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె జెండాను ఆవిష్కరించారు. షర్మిల మాట్లాడుతూ వైఎస్సార్ బిడ్డ పాలేరులోనే పోటీ చేస్తుంది. ఎవరికి ఎటువంటి అపోహలు అవసరం లేదని అన్నారు.

కార్మికుడు లేకపోతే మెతుకు లేదు.ఇంటికి వెలుగు లేదు. దేశం పురోగతికి కార్మికులు అవసరం. వైఎస్సార్ తెలంగాణ పార్టీ కార్మికులకు సలాం చెప్తుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయి. కేసీఅర్ కార్మికులను పురుగుల్లా చూస్తున్నారు. కార్మికులను కేసీఆర్ ఎడమ కాలు చెప్పు కింద తొక్కి పెట్టారు. రాష్ట్రంలో కార్మికులకు ఎటువంటి హక్కులు లేకుండా చేశారు. ఆర్టీసీ కార్మికులు హక్కుల కోసం పోరాటం చేస్తే కనీసం గౌరవం కూడా ఇవ్వలేదు. ఆర్టీసీ లో సంగమే లేకుండ చేశారు. విద్యుత్ శాఖ లో కార్మికులు సమ్మె చేస్తే తొక్కి పెట్టారు. భయ బ్రాంతులకు గురి చేసి సమ్మెను విచ్ఛిన్నం చేశారు. కార్మిక సంఘాలను పూర్తిగా నిర్వీర్యం చేశాడు. కేసీఅర్ కి బానిసలా బ్రతకాలా..? కనీసం వేతనాలు కూడా తెలంగాణ లో అమలు కావడం లేదని అన్నారు. కార్మిక చట్టాల ప్రకారం 26 వేలు కనీస జీతం ఉండాలి. తెలంగాణ లో 10 వేలు కూడా జీతం లేదు. రాష్ట్రంలో కోటి మంది కార్మికులు ఉన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ఎటువంటి పథకాలు లేదు. కార్మిక సక్షేమం కోసం ఎటువంటి బోర్డ్ లు కూడా లేవు. సంక్షేమానికి ఎటువంటి నిధులు కూడా లేవు. ఎనమిది గంటల పని విధానం కూడా అమలు కావడం లేదు. రాష్ట్రంలో లక్ష మంది కాంట్రాక్ట్ బేసిక్ మీద పని చేస్తున్నారు. ఇందులో 5 వేల మందిని రెగ్యులర్ చేస్తే ఎలా..? మిగతా కాంట్రాక్ట్ కార్మికులు ఏమవ్వాలి. ఇక కేంద్రం అమలు చేస్తున్న నిర్ణయాలు కూడా సరైనవి కావు. ఉపాధి హామీ పథకం కింద గొడ్డు చాకిరీ చేయించి 40 రూపాయలు ఇస్తారా అని నిలదీసారు.

## భారీ వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం

**యాదాద్రి**
గుండాల మండల కేంద్రంలో దాన్యం కొనుగోలు సెంటర్ వద్ద ఉన్న వడ్ల రాశులు ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి సెంటర్ దగ్గర వర్షం రావడంతో వరద తా కిడికి పక్కనే ఉన్న చెరువులోకి ధాన్యం రాసులు కొట్టుకుపోయాయి. గుండాల మండలంలో కొన్ని గ్రామాలలో ఐకేపీ, పిఎసిఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు కాంటాలు ప్రారంభించారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు, నల్ల కవర్లు ,తాటిపత్రులు కూడా ప్రభుత్వమే పంపిణీ చేయవలసి ఉన్న ఏ ఒక్క రైతుకు కూడా టార్పాలిన్లు పంపిణీ చేయక పోవడంతో వర్షానికి వడ్ల రాశులు కొట్టుకపోయి నష్టం జరిగింది. ప్రభుత్వం వెంటనే ధాన్యం రాసులు ఉన్న రైతుల వివరాలు నమోదు చేసుకొని కొట్టుకుపోయిన ధాన్యానికి నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

## యాదాద్రిలో విస్తారంగా వర్షాలు

**యాదాద్రి**
యాదాద్రి భువనగిరి జిల్లాలో నాలుగు రోజులుగా అకాల వర్షం కురుస్తుంది. దీంతో రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని 17 మండలాల్లో విస్తారంగా వర్షాలు పడ్డాయి. దీంతో లోతట్టు ప్రాంతాల్లో మరియు మార్కెట్ యార్డలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దాన్యం పూర్తిగా తడిసిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు.
మూసి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రుద్రవెల్లి వద్ద, లో లెవల్ రోడ్డు బ్రిడ్జి మీద ప్రవహిస్తున్న మూసి.. బీబీ నగర్ - పోచంపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. బీమ లింగం కత్వా వద్ద కూడా, లో లెవల్ బ్రిడ్జి రోడ్డు మీద మూసి ప్రవహించడంతో బోలేపల్లి - చౌటుప్పల్ మధ్య రాకపోకలు స్థంభించాయి.
మరోవైపు కామారెడ్డి జిల్లా లో భారీ వర్షానికి రోడ్డు కొట్టుకుపోయింది. కామారెడ్డి -మెదక్ మధ్య రాకపోకలు ఆగిపోయాయి. రాజంపేట మండలం కొండాపూర్- ఎల్లారెడ్డిపల్లి గ్రామాల మధ్య కామారెడ్డి నుంచి మెదక్ వైపు వెళ్లే రోడ్డు కుడా భారీగా దెబ్బ తిన్నది.

## మౌనిక కుటుంబానికి అండగా ఉంటాం

**హైదరాబాద్**
సికింద్రాబాద్ కళాసి గూడలోని నాలాలో పడి మరణించిన బాలిక మౌనిక కుటుంబానికి అండగా వుంటామని మంత్రి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం నాడు మౌనిక కుటుంబ సభ్యులకు 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం చెక్కును మంత్రి అందజేసారు. మౌనిక తల్లిదండ్రులను మంత్రి, డిప్యూటీ మేయర్ పరామర్శించారు. మౌనిక మృతి ఘటన చాలా బాధాకరమని మంత్రి అన్నారు

## హైవేపై వరుస ప్రమాదాలు

**ముమ్మడివరం**
ముమ్మిడివరం మండలం 216 జాతీయ రహదారి బొండాయికోడు తూము వద్ద రొయ్యల లోడ్ తో ఉన్న హైసెర్ వ్యాను హైదరాబాదు ప్రయివేటు ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. అదే సమయంలో వచ్చిన మరో ప్రైవేటు ట్రావెల్ ప్రమాదం చూసి బస్సు డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో పక్కనే ఉన్న పంట బోదిలోకి బస్సు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణీకులకు స్వల్ప గాయాలయ్యాయి.

## మహిళను బెదిరించి దోపిడి

**కాకినాడ**
కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం బ్రిడ్జి వద్ద వెదురుపల్లి శ్రీను వాసరావు అనే వ్యక్తి ఇంటిలో దోపిడీ జరిగింది. ఇంటిలో ఒంటరిగా టి.వి చూస్తున్న శ్రీనివాసరావు భార్యను బెదిరించిన దుండగులు సుమారు 15కాసుల బంగారం, వెండి దోచుకువెళ్లారు. శ్రీనివాసరావు భార్య బయట ఆరబెట్టుకున్న లంగాలను గుర్తు తెలియకుండా దుండగులు ముఖంపై కప్పుకున్నారు. చంపుతామని బెదిరించి లాకర్ తాళాలు తెరిచి బంగారం, వెండి నగలను దోచుకున్నారు. బాధితులు ఆలస్యంగా ఇంద్రపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న క్రైమ్ డిఎస్పీ రాంబాబు అంతా పరిశీలించారు. పోలీసులు డాగ్ స్క్వాడ్ ను రంగంలోకి దింపారు.

## కమ్యూనిస్టు గాంధీ పుచ్చలపల్లి

**కాకినాడ**
స్వాతంత్ర సమరయోధుడు ,దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత అయిన పుచ్చలపల్లి సుందరయ్య' కమ్యూనిస్టు గాంధీ'గా పేరొనీదారని గ్రంధాలయ విశ్రాంతి ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరాడంబరతకు, విలువలకు అధిక ప్రాధాన్యతనిచ్చిన సుందరయ్య ప్రజా సమస్యలపై ఎంతటి వారినైనా సూటిగా నిలదీసేవారని అన్నారు .ఆయన ఆదర్శవంతమైన నేత అని ఆధునిక భారత చరిత్రలో చెరగని ముద్ర వేశారని అన్నారు. ప్రజా ఉద్యమాల పోరాటాలతో పాటు చట్టసభల్లోను సుందరయ్య ప్రజల వాణిని వినిపించడంలో గొప్ప పాత్ర నిర్వహించారని అన్నారు. పార్లమెంట్ సమావేశాలకు కూడా సైకిల్ పై వెళ్లిన ప్రజా సేవకుడు సుందరయ్య అని అన్నారు. తన వాటాకు వచ్చిన యావదాస్తిని పార్టీకి, ఉద్యమానికి ధారపోసి నిరాడంబరంగా జీవించిన సుందరయ్య 1913 మే 1న జన్మించారని సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ఎస్. శ్రీ నగేష్ ,రాజా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# టీచర్ పోస్టులపై తలో లెక్క...

**విజయవాడ :**
ధ్రప్రదేశ్లో ఉపాధ్యాయ పోస్టులు భారీ సంఖ్యలో ఖాళీగా ఉన్నాయని, వీటికి ప్రాధాన్యమిచ్చి భర్తీ చేయాలని కేంద్ర ప్రాజెక్టు ఆమోదిత మండలి (పీఏబీ-ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డ్) వెల్లడించింది. కేంద్ర విద్యాశాఖకు రాష్ట్రం నుంచి అందిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాల ప్రకారం 45,355 ఖాళీలు ఉన్నట్లు వెల్లడించింది. గత పీఏబీలోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించినా విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దీన్ని కొట్టిపారేశారు. అవి కరోనా సమయంలో ఖాళీలని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. ఇప్పుడు కేంద్రం మళ్లీ అదే సంఖ్యను వెల్లడించింది. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఒకపక్క డీఎస్సీ నిర్వహిస్తామంటూ ప్రకటనలు చేస్తుండగా.. విద్యాశాఖ మాత్రం 717 ఎస్జీటీ ఖాళీలే ఉన్నాయంటూ కేంద్రానికి వెల్లడించడం గమనార్హం. సమగ్ర శిక్ష అభియాన్ వార్షిక ప్రణాళిక, బడ్జెట్ 2023-24కు కేంద్రం ఆమోదం తెలిపింది. మార్చి 22న జరిగిన రాష్ట్ర పీఏబీ సమావేశంలో చేసిన తీర్మానాలను శనివారం విడుదల చేసింది. రాష్ట్రంలో 85.5% సెకండరీ పాఠశాలల్లోనే ప్రధాన సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉన్నారని, 57 మంది విద్యార్థులకు ఒక గణిత ఉపాధ్యాయుడు, 67 మందికి ఒక సామాన్యశాస్త్రం, 72 మందికి ఒక సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు చొప్పున ఉన్నారని పేర్కొంది. సెకండరీ స్థాయిలో అన్ని పాఠశాలల్లో అవసరమైన సంఖ్యలో ఉపాధ్యాయులను నియమించాల్సిన అవసరం ఉందని వెల్లడించింది. 2023-24కు మొత్తం రూ.3,843 కోట్ల బడ్జెట్కు ఆమోదం తెలిపింది. ఇందులో గతేడాది ఇచ్చిన రూ.992 కోట్లను కలిపి చూపింది. ఏకోపాధ్యాయ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల సంఖ్య పెరిగిందని పీఏబీ పేర్కొంది. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిలో వ్యత్యాసం ఎక్కువగా ఉందని, దీన్ని పరిష్కరించేందుకు హేతుబద్ధీకరణ చేయాలని సూచించింది. పాఠ్యాంశాల రూపకల్పన, అకడమిక్ కార్యక్రమాలను పర్యవేక్షించే రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) లోనూ ఖాళీలు ఉన్నాయి. 45 అకడమిక్ పోస్టులు మంజూరైతే ప్రస్తుతం 25 మందే ఉన్నారు. జిల్లా విద్య, శిక్షణ సంస్థ (డైట్)ల్లో 325 మంది పని చేయాల్సి ఉండగా.. 262మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఉమ్మడిసర్వీసు నిబంధనల కేసు న్యాయస్థానంలో పెండింగ్లో ఉన్నందున భర్తీ చేయలేక పోతున్నట్లు పేర్కొంది. ఒక్క విద్యార్థీ చేరని ప్రాథమిక పాఠశాలల సంఖ్య రాష్ట్రవ్యాప్తంగా పెరిగింది. 2020-21లో 35 పాఠశాలల్లో సున్నా ప్రవేశాలు ఉండగా.. 2022-23కు వచ్చేసరికి ఇది 40 పాఠశాలలకు పెరిగింది. 2021-22లో 3,670 బడుల్లో 15 మంది లోపు, 12,851 బడుల్లో 30 కంటే తక్కువ మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఆరో తరగతిలో బడి మానేసే విద్యార్థుల సంఖ్య పెరిగింది. 2020-21 నుంచి 2021-22 వరకు చూస్తే 9, 10, 11 తరగతుల్లో ఆ సంఖ్య భారీగా పెరిగింది. దీన్ని తగ్గించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసు కోవాల్సిన అవసరం ఉందని పీఏబీ సూచించింది. యూడైస్ ప్లస్ ప్రకారం ప్రాథమిక నుంచి మాధ్యమిక విద్యకు వెళ్లే విద్యార్థుల సంఖ్య పశ్చిమగోదావరి, కడప, అనంతపురం, కర్నూలు, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లో తక్కువగా ఉంది. ఈ జిల్లాల్లో ప్రాథమిక నుంచి మాధ్యమిక విద్యకు వెళ్లకుండా మానేస్తున్నవారు 2లక్షల మంది ఉన్నారని నివేదిక వెల్లడించింది. ప్రభుత్వం మాత్రం పదో తరగతి తర్వాత విద్యార్థులు పాలిటెక్నిక్, సర్టిఫికెట్ కోర్సులకు వెళు తున్నారని సమాధానమిచ్చింది.

# సెలవుల్లేవ్... టీచర్లకు విద్యాశాఖ ఆదేశాలు

**విజయవాడ :**
ఏపీలో వేసవి సెలవుల్లోనూ ప్రభుత్వ టీచర్లకు పనులు అప్పగిస్తూ పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో 3, 4, 5 తరగతులకు వర్క్షీట్లు అందించడం, 'మేము చదవడాన్ని ఇష్టపడతాం', జగనన్న విద్యా కానుక కిట్ల సరఫరా, పీఎం శ్రీ పాఠశాలల కాస్టింగ్ షీట్ రూపకల్పన, 'నాడు-నేడు' పనులు, పిల్లలు గ్రంథాలయాలకు వెళ్లేలా చూడడం, విద్యార్థుల ప్రవేశాల నిర్వహణలాంటి పనులను అప్పగించింది. సెలవులు విద్యార్థులకేగాని ఉపాధ్యాయులకు కాదంటూ కొందరు అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేయడంపై ఉపాధ్యాయులు ఆందోళన చెందు తున్నారు. ఈ క్రమంలో మే 1నుంచి పాఠశాలలకు ఇచ్చే సెలవుల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల విధులపై ఉన్నతాధికారులు ఆదేశాలనిచ్చారు. ఉపాధ్యాయులు బడికి రావాలా? వద్దా? అనే దానిపై స్పష్టత ఇవ్వకుండానే అనేక పనులు అప్పగించారు. దీనిపై ఉపాధ్యాయుల్లో గందరగోళం నెలకొంది. 'నాడు-నేడు' పనులు, పదో తరగతి ఫలితాల తర్వాత టీసీల జారీ, ఇతరత్రా కార్యకలాపాల కోసం ప్రధానోపాధ్యాయులు ప్రతి రోజు బడులకు రావాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు సెలవు పెడితే ఆ సమయంలో మరో ఉపాధ్యాయుడిని నియమించాలని ఆదేశించారు. వేసవి సెలవుల్లో ప్రతి పాఠశాలలో 23 రకాల కార్యకలాపాలను నిర్వర్తించాల్సి ఉంటుంది. 3,4,5 తరగతులకు వర్క్షీట్లను ఇవ్వాలని ఆదేశించిన అధికారులు ముద్రించిన వాటిని మాత్రం సమకూర్చలేదు. వాటిని జిరాక్స్ తీసేందుకు ఉపాధ్యాయులు సొంత డబ్బులు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 'మేము చదవడాన్ని ఇష్టపడతాం' కార్యక్రమాన్ని మే 1 నుంచి జూన్ 10 వరకు నిర్వహించాలి. పాఠశాలలోని విద్యార్థులను బృందాలుగా విభజించి ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాలి. వాట్సప్ గ్రూపు ఏర్పాటుచేసి రోజువారీగా కథలను అందులో పోస్టు చేయాలి. ఆ కథలు చదివాక విద్యార్థుల అభిప్రాయాలను సేకరించాలి. విద్యార్థుల చదివే సామర్థ్యం ఆధారంగా పాఠశాల గ్రంథాలయంలోని పుస్తకాలను ఒక్కొక్కరికి 5 నుంచి 10 ఇవ్వాలి. ఇచ్చిన పుస్తకాలను విద్యార్థి చదివేస్తే స్నేహితుల వద్దనున్న పుస్తకాలతో మార్చుకునేలా చూడాలి. అంతేకాకుండా గ్రామాల్లోని ప్రజా గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలను తెచ్చుకునేలా పిల్లలకు అవగాహన కల్పించాలి. ఈ పనులను రికార్డు చేయాలి. అధికారులు ఎప్పుడైనా పరిశీలిస్తే చూపించాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవేశాలపైనా దృష్టి పెట్టాల్సి ఉంటుంది. 5వ తరగతి పూర్తయినవారు ప్రభుత్వ బడుల్లో ఆరో తరగతిలో ప్రవేశించేలా చూడాలి. కింది తరగతుల్లోనూ విద్యార్థుల ప్రవేశాలపై దృష్టి పెట్టాలి. పిల్లలకు నైతిక విలువలు నేర్పించాలి. పిల్లవాడి బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలి. వారే తల్లిదండ్రుల్లా వ్యవహరించాలని సూచించారు. పిల్లలు సైతం వేసవి సెలవుల్లో తామేం చేశామో నోట్బుక్లో రాసి తరగతి ఉపాధ్యాయుడికి ఇవ్వాలి. దీన్ని కచ్చితంగా అమలు చేయాలి. జగనన్న విద్యాకానుక కిట్లను వారు తీసుకెళ్లాలి.

# పరకామణిలో ఇంటి దొంగలు

**తిరుమల:**
తిరుమలలోని నూతన నోట్ల పరకామణి మండపంలో ఓ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించాడని తిరుమల తిరుపతి దేవస్థానం ఓ ప్రకటనలో తెలిపింది. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ కెమెరాల నిఘా ఏర్పాటు ఉన్నా కూడా అతను చోరీకి పాల్పడడంతో అధికారులు విస్తుపోయారు. సీసీటీవీ కెమెరాల ద్వారా విజిలెన్స్ అధికారులు నిందితుడిని ఇట్టే గుర్తించారని ప్రకటనలో పేర్కొన్నారు. నోట్ల లెక్కింపు సమయంలో కొన్ని విదేశీ నోట్లను మల ద్వారం వద్ద ఉంచుకుని బయటకు వెళుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగిని సీసీటీవీ కెమెరాల ద్వారా గుర్తించారు. విజిలెన్స్ అధికారులు అతణ్ని అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో నోట్లను గుర్తించి వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు అయింది. నూతన పరకామణి మండపంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చెయ్యడం, అడుగడుగునా సీసీటీవీ కెమెరాల నిఘా ఉంచడంతో ప్రతి ఒక్కరి కదలికపై సూక్ష్మ స్థాయిలో నిఘా ఉంచుతున్నారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగినా వెంటనే గుర్తించే వెసులుబాటు ఉండేది కాదు. నూతన పరకామణి మండపంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం తో కూడిన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగింది. దీంతో స్వామి సేవ కోసం వచ్చి, చోరీకి పాల్పడుతున్న వారిని వెంటనే గుర్తించగలుగుతున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఘటనలు జరగకుండా పూర్తి స్థాయిలో పర్యవేక్షణ కొనసాగుతుందని భద్రత అధికారులు స్పష్టం చేశారు. తిరుమల శ్రీవారి ఆలయానికి సమీపంలో నిర్మించిన నూతన పరకామణి భవనాన్ని గత ఫిబ్రవరిలో టిటిడి ఈవో ఏవీ.ధర్మారెడ్డి ప్రారంభించారు. ముందుగా ఉదయం 9 గంటల నుండి నూతన పరకామణి భవనంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పుణ్యాహవచనం, గోమాత ప్రవేశం, గోపూజ, సుదర్శన హోమం వంటి కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఆలయం నుండి తీసుకుని వచ్చిన హుండీ కానుకలను వేరు చేయడం, లెక్కించడం ప్రక్రియను ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన దాత మురళీకృష్ణ అందించిన రూ.23 కోట్ల విరాళంతో అధునాతన సౌకర్యాలతో కూడిన నూతన పరకామణి భవనాన్ని టీటీడీ నిర్మించింది. గత ఏడాది శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సెప్టెంబరు 28న ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఈ నూతన పరకామణి భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఈ భవనంలో అభివృద్ధి పనులను టిటిడి చేపట్టింది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసిన భక్తుడు స్వామి వారికి సమర్పించే కానుకల లెక్కింపు స్వయంగా వీక్షించే విధంగా భవనంకు నలువైపులా అద్దాలు ఏర్పాటు చేసింది టిటిడి. ఈ సందర్భంగా టిటిడి ఈవో ఏవి.ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ. తిరుమలలో అత్యాధునిక వసతులతో నిర్మించిన నూతన పరకామణి భవనంను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ నూతన పరకామణి భవనంలో అన్ని సిబ్బందికి అవసరం అయ్యే అన్ని ఏర్పాట్లు కల్పించడం జరిగిందని, అయితే 12 హుండీలను శ్రీవారి ఆలయం నుండి నూతన పరకామణికి తరలించి, లెక్కింపు ప్రక్రియను ప్రారంభించామన్నారు. అయితే ముందస్తుగా హుండీ కానుకలను పరకామణికి తరలించేందుకు ట్రయల్ రన్ చేశామని, నేడు అది సక్సెస్ ఫుల్ అయిందని అన్నారు. రేపటి నుండి హుండీ కానుకలను నూతన పరకామణి భవనంలో లెక్కించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. శ్రీవారి ఆలయంలో ఉన్న ప్రస్తుత పరకామణిలో భక్తులు కూర్చుని ధ్యానం చేసుకోడానికి స్థలం కేటాయించారు

## కాంగ్రెస్ నాయకులకు సన్మానం



**కమాన్ పూర్**
కమాన్ పూర్ మండలంలోని గుండారం గ్రామంలో ఇటీవల కమాన్ పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియామకమైన వైనాల రాజు , పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియామకమైన రంగు సత్యనారాయణ గౌడ్ , పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ సెక్రెటరీ గా నియామకమైన భూనీపల్లి రాజయ్య లను గుండారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు .. గుండారం గ్రామ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన గుండారం గ్రామ సర్పంచ్ ఆకుల ఓదెలు,పిడుగు శంకర్,జక్కుల శ్రీను, గణవేన రవి, అద్వాల చంద్రయ్య ,జంగిలి కనకయ్య, మజీద్ ఖాన్ ,రాచకొండ రాయమల్లు, రాచకొండ ఓదెలు ,కొమురయ్య గోస్కూల లక్ష్మణ్, ముదాం శ్రావణ్ ,వడ్లకొండ శంకర్ ఆకుల రమేష్ రాచకొండ శ్రీను పిడుగు సదయ్య గుండారం గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు

## ఎమ్మెల్యే కన్నబాబు రాజుకు నిరసన సెగ

**అనకాపల్లి**
అనకాపల్లి జిల్లా యలమంచిలి వైసీపీ ఎమ్మెల్యే కన్నబాబు రాజుకు నిరసన సెగ తగిలింది. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనగా.. పూడిమడక జెట్టీ నిర్మాణ హామిని నెరవేర్చాలని సొంత పార్టీలోని కొందరు నేతలు డిమాండ్ చేశారు. పథకాల అమలు విషయంలో వివక్ష చూపిస్తు న్నారని వాగ్వాదానికి దిగారు. దీంతో ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే ఓ వ్యక్తిపై చేయి చేసుకున్నారు. దింతో అక్కడ ఉద్రిక్తత ఏర్పడింది.

## వరంగల్ లో భారీ వర్షం

**వరంగల్**
వరంగల్ జిల్లా వర్ధన్నపేట,రాయపర్తి మండల్లలో ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి పై అక్కడక్కడ చెట్లు విరిగి పడటం తో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పర్వతగిరి, సంగెం,ఐనవోలు మండలల్లో పలు చోట్ల అకాల వర్షం తో విద్యుత్ సరఫరా నిలిచిపోయి కొన్ని గ్రామాలు అంధకారంలో నిలిచిపోయాయి. మరో వైపు అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల దగ్గరకి తెస్తే వర్షానికి తడిచిపోయాయి. వర్షపు నీటి లో ధాన్యం కొట్టుకోపాయింది,దీంతో రైతులు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని కోనుగోలు చేయాలని కోరుతున్నారు బాధిత రైతులు.

## విశాఖలో ఘనంగా మేడే వేడుకలు

**విశాఖపట్నం**
కార్మిక లోకానికి వెన్నుద న్నుగా నిలిచింది ముఖ్యమంత్రి జగన్ ఒక్కరేనని, పార్టీ పేరులోనే కార్మికులకు ప్రత్యేక స్థానం కల్పించిన ఘనత ఆయ నకే దక్కిందని మంత్రి గుడివాడ అమ ర్నాథ్ అన్నారు. మేడే సందర్భంగా విశాఖ వైఎస్ఆర్సిపి కార్యాలయంలో జరిగిన కార్మిక దినోత్సవ వేడుకల్లో మంత్రి అమర్ తో పాటు,నగర అధ్య క్షులు పంచకర్ల రమేష్ బాబు,పార్టీ నేతలు పాల్గొన్నారు. జగన్మోహన్ రెడ్డి కార్మికుల సంక్షేమం కోసం అనేక కార్య క్రమాలు చేపట్టారని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని తప్పు పట్టాలని ప్రతిపక్షాలు అనేక విమర్శలు చేస్తున్నాయని అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ వ్యతిరేకంగా కార్మికులు చేస్తు న్న ఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వ మద్ద తు సంపూర్ణంగా ఉందని అమర్నాథ్ చెప్పారు. ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చడానికి ముఖ్యమంత్రి జగన్మో హన్ రెడ్డి అనేక చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. మరోవైపు సిపిఐ కార్యాలయంలో జరిగిన వేడు కల్లో పార్టీ నేతలు పాల్గోని జెండాను ఆవిష్కరించారు.

## తాపీ కార్మికుల మేడే

**ఏలూరు**
ఏలూరుజిల్లా పెదవేగి మండలం కూచింపూడి గ్రామంలో తాపీ కార్మికులు సోమవారం శుద్ధరాళ్ల మెట్ట దగ్గర ఉన్న కార్మిక స్తూపం వద్ద మేడే దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్మికుల హక్కుల కోసం కార్మిక సంఘాల నాయకులు పారిశ్రామిక యాజ మాన్యాలు పై చేసిన ఉద్యమాల ద్వారా సాధించిన హక్కుల వల్లే మే 1 వ తేదీన మేడే దినోత్సవం ఆవిర్భవించిందని కార్మికులు గుర్తు చేసుకున్నారు కార్మికుల హక్కుల సాధనకోసం జరిగిన పోరాటాల లో ఎంతో మంది కార్మిక సంఘాల నాయకులు తమ రక్తాన్ని చిందించి అమరులయ్యారని వారు చిందించి రక్తానికి గుర్తే మేడే నాడు వాడవాడలా ఎగిరే ఎర్రని అరుణ పతాకాలని కార్మిక నాయకులు రవి.రాటాలు.శివ తదితరులు అన్నారు

## ఎయిమ్స్ లో కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ,**
కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఆ సమయంలో ఆయన ఢిల్లీలో ఉండగా, కుటుంబ సభ్యులు వెంటనే కిషన్ రెడ్డిని ఆదివారం రాత్రి ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రికి తీసుకొని వెళ్లారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో ఎయిమ్స్‌కు వెళ్లారు. అయితే, ఆయనకు గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నట్లుగా డాక్టర్లు గుర్తించారు. కార్డియోన్యూరో సెంటర్‌లోని కార్డిక్ కేర్ యూనిట్‌లో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయనకు గ్యాస్ట్రిక్ సమస్యే ఉన్నట్లుగా డాక్టర్లు చెప్పారు.

# భాగ్యనగరంలో అభివృద్ధి ఒక వైపేనా...

**హైదరాబాద్ :**

కొద్ది రోజుల కిందట సైబరాబాద్ వైపు వెళ్లానని న్యూయార్క్‌లో ఉన్నానా.. హైదరాబాద్‌లో ఉన్నానా అన్నది గుర్తించలేకపోయానని సూపర్ స్టార్ రజనీకాంత్ విజయవాడలో జరిగిన ఎన్టీఆర్ శత జయంతి వేడుకల్లో వ్యాఖ్యానించారు. ఆయన అలా అన్న గంటల్లోనే... గంట పాటు కురిసిన వర్షానికి హైదరాబాద్‌లోని ఓ భాగం అతలాకుతలం అయిపోయింది. జీహెచ్ఎంసీ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా మరో పసిప్రాణం నాలాకు బలైపోయింది. పాల కోసం వెళ్తూ చిన్నారి నాలాలో పడి మత్యువాత పడటానికి కారణం జీహెచ్ఎంసీ నిర్లక్ష్యమేనని వెల్లడైంది. నాలాల్లో మరణాలు జరగరాదని గత రెండేళ్లుగా మంత్రి కేటీఆర్ తీవ్ర హెచ్చరికలు చేస్తూ.. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నా ఘోరం జరిగిపోయింది.గత వర్షాకాలం నాలా మరణాలు లేవనుకుంటుండగానే ఈసారి వానాకాలం రాకముందే వేసవిలోనే అయినా నాలాలో పసిప్రాణం బలైపోయింది. దీనికి పూర్తి బాధ్యత జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డులదేనని చెప్పక తప్పదు. వీడీసీసీ రోడ్డు కోసం జీహెచ్ఎంసీ ఉన్న రోడ్డును తవ్వి పనులు చేపట్టింది. డ్రైనేజీ లైన్ వేయడంలో వాటర్‌బోర్డు జాప్యం చేసింది. పనుల ప్రాంతంలో గుంతను పట్టించుకోలేదు. పనులు జరిగే ప్రాంతాల్లో పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన రక్షణ చర్యలు, ఏర్పాటు చేయాల్సిన సైనేజీలు వంటివి పూర్తిగా గాలికొదిలేశారు.ఓపెన్ నాలాకు ఓ చిన్నారి బలైపోయింది. కార్లు, బైకులు కొట్టుకుపోయిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. అద్భుతాల్ని తలపించేలా ఉండే ఐటీ కారిడార్ ఓ వైపు.. గంట పాటు భారీ వర్షం వస్తే తట్టుకోలేని నగరం మరో వైపు ఉందా అన్న భావన కలిగేలా ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. హైదరాబాద్ మౌలిక సదుపాయాలపై చర్చ కూడా అందుకే ప్రారంభమయింది. హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌కు రాత్రి సమయంలో వెళ్తే?..రజనీకాంత్ చెప్పినట్లుగా మనం ఏదో విదేశీ నగరంలో ఉన్నామా అన్నభావన కలిపిస్తుంది. విశాలమైన రహదారులు. అద్భుతమైన అద్దాల మేడలు. విలాసవతమైన ఆకాశాన్ని తాకుతున్నాయా అన్నట్లుగా ఉండే అపార్టుమెంట్లు కనిపిస్తు? ఉంటాయి. అదే సమయమంలో ఎటు చూసినా ఫ్లై ఓవర్లు .. లగ్జరీ బ్రాండ్ల షోరూములు... హైక్లాస్ రెస్టారెంట్లు ఇలా కళ్లు చెదిరేలా కనిపిస్తూ ఉంటాయి. ఇటీవల ప్రతీ చోటా ఫ్లైఓవర్లు ప్రారంభించడంతో పాటు డ్రోన్లతో అద్భుతమైన దృశ్యాలు తీసే టెక్నాలజీ రావడంతో ఇక ఆ దృశ్యాలు ఊహించనంతగా వైరల్ అవుతున్నాయి. అందుకే హైదరాబాద్ అద్భుతంగా అభివృద్ధి చెందిందన్న భావన అందరిలోనూ కలుగుతోంది. తెలంగాణ ప్రభుత్వ పెద్దలు కూడా వీటిని చూపించి ... అభివృద్ధి చెందామని చెబుతున్నారు. హైదరాబాద్ నగరం విస్తరిస్తోంది. ఓ పదేళ్ల కిందట హైదరాబాద్ శివారు విస్తరించేది కాదు. కూకట్ పల్లి నుంచి ఎల్బీ నగర్ వరకూ ఉన్నదే నగరం. అయితే ఇటీవలి కాలంలో శివార్లు బాగా అభివృద్ధి చెందుతున్నాయి. విల్లాలు.. ఇండిపెండెంట్ హౌస్‌లలో ఉండేందుకు జనం ఆసక్తి చూపిస్తూండటంతో ఇప్పుడు నగరం ఔటర్ దాటి ఇరవై కిలోమీటర్ల వరకూ విస్తరిస్తోంది. ఈ వైపు రియల్ ఎస్టేట్ అభివృద్ధి కోసం మౌలిక సదుపాయాలు పెంచుతూ పోతున్నారు కానీ.. అసలైన హైదరాబాద్‌లో మాత్రం మౌలిక సదుపాయాలు ఎక్కడివక్కడే ఉండిపోతున్నాయి. ముఖ్యంగా సవాల్‌గా మారిన వర్షాలు పడినప్పుడు వరదల నిర్వహణను అధిగమించలేకపోతున్నారు. నాలాలు కుంచించుపోవడం.. చెరువులు ఆక్రమణకు గురి కావడమే కాదు.. వాతావరణ మార్పుల కారణంగా... రోజంతా పడే వర్షం ఒక్క గంటలోనే పడుతోంది. ఫలితంగా హైదరాబాద్‌లో విషాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఓ వైపు ప్రపంచస్థాయి సెక్రటేరియట్ ను నిర్మించుకున్నామని ప్రభుత్వం సంబరంగా .. ప్రకటించుకుంటున్న సమయంలో.. ఓపెన్ నాలాలో పడి ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. వర్షం దాటికి కార్లు, వాహనాలు కూడా కొట్టుకుపోయిన దృశ్యాలు కనిపించాయి. దీంతో సెక్రటేరియట్ గొప్పదనం కన్నా.. ఇవే ఎక్కువగా ప్రచారంలోకి వస్తున్నాయి. సెక్రటేరియట్ వల్ల గొప్పలు చెప్పుకోవచ్చు కానీ ముందు హైదరాబాద్ ప్రజలకు సమస్యలుగా ఉన్న వాటిని పరిష్కరించాలి కదా అన్న అభిప్రాయం వినిపిస్తోంది. హైదరాబాద్‌లో ఎంత వానపడినా నిర్వహణ ఉండేలా నాలాలు మారుస్తామని.. చెరువుల ఆక్రమణలు తొలగిస్తామని.. గ్రేటర్ ఎన్నికలకు ముందు వచ్చిన భారీ వరదల సమయంలో చెప్పారు.కానీ మళ్లీ మళ్లీ అలాంటివి జరుగుతున్నాయి కానీ ఎలాంటి పురోగతి ఉండటం లేదు. ప్రైవేటు కంపెనీలు.. ఐటీ కారిడార్‌లో భవనాలు కడతాయని వాటిని చూపించి హైదరాబాద్ ను న్యూయార్క్ చేశామని బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేసుకుంటున్నారని అసలు చేయాల్సిన అభివృద్ధి మాత్రం చేయడం లేదని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు సమాధానం చెప్పడం ప్రభుత్వానికీ ఇబ్బందికరంగా మారింది.

# అటవీశాఖ అభ్యంతరం

## నిలిచిన రోడ్డు విస్తరణ పనులు

**నిజామాబాద్ :**

నిజామాబాద్ జగ్దల్ పూర్(చత్తీస్ గఢ్) నేషనల్ హైవే 63 రోడ్డు విస్తరణ పనులు ఉన్నట్టుండి ఆగిపోయాయి. అటవీ శాఖ నుంచి అనుమతులు లేకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టారని ఫారెస్ట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో రోడ్డు విస్తరణ కోసం ఏడు నెలల నుంచి హైవే అధికారులు తవ్విన కందకాలను హడావుడిగా పూడ్చేశారు. పనులు పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సిన ఫారెస్ట్ అధికారులు అటువైపు చూడడం లేదు. దీంతో రోడ్డు విస్తరణ పై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.మంచిర్యాల శివారు నస్పూర్ -జైపూర్ మండలం రసూల్ పల్లి మధ్య 9.8 కి.మీ రోడ్డు విస్తరించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడానికి రూ.55.50 కోట్ల డీఎంఎఫ్ టీ ఫండ్స్ ను కేటాయించారు. ఈ నిధులతో ఇరువైపు 66 ఫీట్లతో ఫోర్ లేన్ రోడ్డు, మధ్యలో 15 మీటర్ల వెడల్పుతో డివైడర్ , సెంట్రల్ లైటింగ్, 18 చోట్ల జంక్షన్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులను 15 నెలల్లో పూర్తి చేయాలని అధికారులు అనుకున్నారు. ఈ పనుల్లో భాగంగా శ్రీరాంపూర్ సింగరేణి ఓపెన్ కాస్ట్ గనికి వెళ్లే రహదారి నుంచి అరుణక్క నగర్, జీఎం ఆఫీస్ వరకు దాదాపు 2 కి.మీ దాకా రోడ్డుకు ఒకసైడ్ ఆరు అడుగుల వెడల్పుతో నాలుగు అడుగుల లోతు కందకాలు తవ్వారు. అయితే ఈ పనులకు అటవీ శాఖ నుంచి అనుమతి లేదని ఆ శాఖ అధికారులు అభ్యంతరం చెప్పారు. రోడ్డు విస్తరణ కోసం కందకాలు తవ్వడంపై అడ్డుచెప్పారు. హైవే ఆఫీసర్లు పనులు నిలిపివేశారు. పర్మిషన్ లేకుండా చేపట్టిన హైవే 63 రోడ్డు విస్తరణ పనులను చూసేందుకు చెన్నై నుంచి అటవీశాఖ టీమ్ వస్తుందన్న సమాచారంతో హైవే ఆఫీసర్లు తవ్విన కందకాలను హడావుడిగా పూడ్చేశారు. రహదారి విస్తరణ పర్మిషన్ లేదనే సాకుతో 4 కి.మీ పొడవున పనులకు బ్రేక్ వేశారు.శ్రీరాంపూర్ ఓసీపీ రహదారి నుంచి సింగరేణి జీఎం ఆఫీస్ , ఇందారం క్రాస్ వరకు సింగరేణి బొగ్గు గనులకు సంబంధించిన పనులు సాగుతుంటాయి. ఇందుకు అటవీశాఖ నుంచి పర్మిషన్లు తీసుకుంటూ బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ చేస్తున్నారు. ఇక్కడే నేషనల్ హైవే ఉంది. అటవీశాఖ నుంచి పర్మిషన్? తీసుకోకుండా హైవే ఆఫీసర్లు కందకాల పనులు చేపట్టి పూడ్చివేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఎమ్మెల్యేలు, అధికార పార్టీ లీడర్లు, అటవీశాఖ మంత్రి ఎందుకు చొరవచూపడంలేదని ప్రశ్నిస్తున్నారు. చెన్నైకు సంబంధించిన అటవీశాఖ ఆఫీసర్లు వచ్చి రోడ్డు విస్తరణ పనులు పరిశీలించిన తర్వాత వారిచ్చే పర్మిషన్ ఆధారంగా మళ్లీ పనులు చేపడుతాం

# కార్మికుల సంక్షేమానికి పెద్ద పీట

**ఖమ్మం**

ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే సందర్భంగా సోమవారం ఖమ్మం నగరం 3టౌన్ మిర్చి మార్కెట్ వద్ద గల బీఆర్ఎస్కేవి సంఘం కార్యాలయంలో కార్మిక జెండా ను మంత్రి పువ్వాడ ఆవిష్కరించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ అధ్వర్యంలో సుమారు 3వేల మంది మార్కెట్ కార్మికులకు ఏకరూప దుస్తులను మంత్రి పువ్వాడ పంపిణీ చేశారు. నగరంలోని పలు చోట్ల యూనియన్ జెండాలను ఆవిష్కరించారు.

మిర్చి మార్కెట్ నుండి ర్యాలీగా పంపింగ్ వెల్ రోడ్, గాంధీ గంజ్, గాంధీ చౌక్, గుంటి మల్లన్న టెంపుల్ రోడ్, నయా బజార్ సెంటర్, జూబ్లీ క్లబ్, బ్రిడ్జి మీదుగా మయూరి సెంటర్, ఓల్డ్ బస్ స్టాండ్, జడ్పి సెంటర్, ఇల్లందు సర్కిల్ లో సభ, జమ్మిబండ, బోనకల్ లీ-రోడ్, చర్చ్ కాంపౌండ్ మీదగా మిర్చి మార్కెట్ వరకు భారీ ర్యాలీ ప్రదర్శన కొనసాగింది.

పువ్వాడ మాట్లాడుతూ కార్మికులు, కర్షకుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసిఆర్ నాయకత్వంలోని టి.ఆర్.ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నగరం విస్తరిస్తుంది, నగరంలో అద్భుతంగా రోడ్లు విస్తరించినం, ప్రయాణ సౌకర్యాలు పెంచినం, అనేక మందికి కార్మికులకు వివిధ రూపాల్లో ఉపాధి పెంచినం అని అన్నారు.

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి చేసినం, కార్మికులకు సౌకర్యాలు పెంచినం, సేవలను విస్తరించిన అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వెల్ఫేర్ బోర్డ్ ద్వారా కార్మికులకు ఎవరికైనా ప్రమాదం జరిగితే రూ.6 లక్షలు, ఇంట్లో పెళ్లి అయితే రూ.30 వేలు, ప్రమాదం జరిగితే ఆదుకుంటుందని అన్నారు. ఖమ్మం లో ఈఎస్ఐ ఆసుపత్రిని తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల చికిత్సలను ఉచితంగా అందిస్తామని అన్నారు

వచ్చే ఆరు నెలలు ఆటో కార్మికులు నోరు తెరవాలసిన అవసరం ఉందన్నారు. మనం చేసుకున్న అభివృద్ధి గూర్చి వివరించాలని కోరారు. సంఘటిత, అసంఘటిత రంగాలు అనే తేడా లేకుండా అన్ని వర్గాల సంక్షేమానికి సమానంగా కృషి చేస్తోందని వివరించారు. నిర్మాణ రంగంలోని కార్మికుల సంక్షేమానికి బోర్డు ద్వారా ప్రతి ఏడాది కోట్ల రూపాయల లబ్ది చేకూర్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక జాతీయ అవార్డులను కైవసం చేసుకుందని, కార్మికులకు ఎక్కడి నుంచి అయినా ప్రభుత్వ సహకారం పొందే అవకాశం లభించిందన్నారు. దేశ ప్రగతికి పారిశ్రామిక అభివృద్ధి గీటురాయి అని ఇందులో కార్మికులు, శ్రమ జీవులే భాగస్వాములని ఆయన పేర్కొన్నారు. కార్మికులు అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తుందని వెల్లడించారు.

కేసీఅర్, కెటిఆర్ నాయకత్వంలో నా తెలంగాణ ఎనిమిదేండ్ల స్వరాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సాక్షిగా అమెరికా తరువాత అంతర్జాతీయ కంపెనీలు తమ తమ వ్యాపార కార్యకలాపాలకు రెండవ కేంద్రంగా హైదరాబాద్ నగరాన్ని ఎంచుకున్న విషయాన్ని గుర్తు చేశారు.దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక విధానం తీసుకురావడం వల్ల అంతర్జాతీయంగా పేరొందిన కంపెనీలు మన వద్దకు వస్తున్నాయని, తద్వారా కార్మికులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యతాప్రమాణాలతో కూడిన ఉపాధి, వేతనం లభిస్తోందన్నారు.ఈ విధంగా కార్మికులకోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి కార్మికుల సంపూర్ణ సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వం టిఆర్ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు.మరోసారి కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులందరికీ మేడే శుభాకాంక్షలు తెలిపారు.

# రాష్ట్రంలో వైకాపాకు తిరుగులేదు

**బద్వేలు**



రాష్ట్రంలో వైకాపాకు తిరుగు లేదని ఎమ్మెల్సీ టీజీ గోవిందరెడ్డి బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా అన్నారు బద్వేలు వైకాపా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు ఈ మేరకు స్పష్టం చేశారు బద్వేల్ నియోజకవర్గం లో 80 శాతం మంది ప్రజలు వైకాపా వైపు ఉన్నారని వారు పేర్కొన్నారు గడప గడపకు వెళ్ళినప్పుడుసీఎం జగన్ వెంటే మేమంతా ఉంటామంటూ మద్దతు ప్రకటించిన ప్రజలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఏప్రిల్ నెలలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా అపూర్వ స్పందన లభించిందని, అందులో భాగంగా 1 45 లక్షల కుటుంబాలకు సర్వే నిర్వహించగా ఒక కోటి 10 లక్షల మంది ప్రజలు స్పందించారని ఇందుకు ప్రభుత్వ పరిపాలనే నిదర్శనమని ఎమ్మెల్సీ డిసి గోవింద్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధా పేర్కొన్నారు .బద్వేలు పట్టణం నెల్లూరు రోడ్ లోని వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ గోవింద్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధా ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ఆదేశాలను మేరకు నియోజకవర్గంలోని వైసిపి నాయకులు గ్రామ సచివాలయాల కన్వీనర్లు ,గ్రామ సర్పంచులు ,మండల అధ్యక్షులు జడ్పీటీసీ సభ్యులు వార్డు కౌన్సిలర్లు గృహ సారధులు రోజులు అలాగే ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలపడం జరిగింది. భవిష్యత్తులో వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు మెరుగైన సహకారం అందించే ప్రయత్నంలో ఉన్నారని, అందుకు రాష్ట్ర ప్రజలు ఇచ్చిన మిస్డ్ కాల్చే ఇందుకు నిదర్శనం అన్నారు .కావున జరగబోవు రోజుల్లో పార్టీ కొరకు పార్టీ అభివృద్ధి కొరకు మరింత కష్టపడి పనిచేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జగనన్న రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రధాన కారణమని, కావున జరగబోవు రోజుల్లో మరింత కష్టించి పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాల్సిందిగా ఈ సందర్భంగా గోవింద్ రెడ్డి, డాక్టర్ సుధా అభ్యర్థించడం జరిగింది

# తెలంగాణలో తొలి రాజశ్యామల ఆలయ నిర్మాణం

**హైదరాబాద్ :**

జ్ఞానవిద్యా ప్రసాదిని, రాజయోగ ప్రదాయినిగా ఖ్యాతికెక్కిన రాజశ్యామల అమ్మవారి ఆలయం తొలిసారి తెలంగాణ గెడ్డపై నిర్మాణమవుతోంది. హైదరాబాద్ కేంద్రంగా రాజశ్యామల అమ్మవారికి దేవాలయం నిర్మించాలని విశాఖ శ్రీ శారదాపీఠం నిర్ణయించింది. ఈమేరకు సన్నాహాలు చేస్తోంది. ఈనెల ఏడవ తేదీన ఉదయం 11 గంటల 7 నిముషాలకు శంకుస్థాపన ముహూర్తం నిర్ణయించారు. విశాఖ శ్రీ శారదాపీఠానికి గతంలో కేసీఆర్ ప్రభుత్వం కోకాపేటలో రెండెకరాల స్థలం మంజూరు చేసింది. ఆ స్థలంలోనే రాజశ్యామల అమ్మవారి కోవెల నిర్మాణం జరగనుంది. ఆలయ నిర్మాణం ఆగమోక్తంగా సాగాలని పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి నిర్ణయించారు. ఈమేరకు ఉద్ధండులైన ఆగమ పండితులను సంప్రదించారు. దక్షిణ భారతావనికే తలమానికంగా నిలిచేలా ఆలయ నిర్మాణం ఉండాలని స్థపతులతో చర్చించారు. శిల్పకళా సౌందర్యం ఉట్టిపడేలా ప్రణాళికను సిద్ధం చేసారు. చోళులు, పల్లవుల నాటి నిర్మాణ శైలి ఆలయంలో కనపడుతుంది. కాకతీయుల శిల్ప కళా నైపుణ్యంతో శిలలు చెక్కుతారు. కోకాపేటలో ఇప్పటికే పీఠం సంబంధిత ఇతరత్రా నిర్మాణాలు సిద్ధమవుతున్నాయి. జగన్మాత రాజశ్యామల అమ్మవారి ఆలయం ప్రస్తుతానికి విశాఖ శ్రీ శారదాపీఠంలో మాత్రమే ఉంది. రాజశ్యామల అమ్మవారు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆరాధ్య దైవం. అమ్మవారి విగ్రహారాధన యావత్ భారతావనిలో కేవలం విశాఖ శ్రీ శారదాపీఠంలో మాత్రమే జరుగుతోందని గతంలో కేసీఆర్ స్వయంగా పేర్కొన్నారు. అమ్మవారి దర్శనం కోసమే విశాఖకు వెళుతున్నానని కూడా ఆయన తెలిపారు. అనేక సందర్భాల్లో కేసీఆర్ రాజశ్యామల యాగాన్ని సైతం చేపట్టారు. విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి పర్యవేక్షణలోనే యాగాన్ని నిర్వహించారు.విశాఖ శ్రీ శారదాపీఠం అధిష్టాన దేవత రాజశ్యామల అమ్మవారు. శ్రీ శారదా స్వరూప రాజశ్యామలగా అమ్మవారు విశాఖ శ్రీ శారదాపీఠంలో పూజలందుకుంటోంది. రాజశ్యామల అమ్మవారి దర్శనానికి, అనుగ్రహానికి కేరాఫ్ అడ్రస్‌గా విశాఖ శ్రీ శారదాపీఠం విశేష ప్రాచుర్యం పొందింది. హిమాలయాల్లో ఒక తపస్సంపన్నుడి ద్వారా అమ్మవారి మంత్ర, తంత్ర విధానాన్ని తెలుసుకున్నానని స్వరూపానందేంద్ర స్వామి అనేక సందర్భాల్లో తెలిపారు. అంతేకాదు, విశాఖ శ్రీ శారదాపీఠ గురుపరంపరలో పూర్వం నుంచి రాజశ్యామల అమ్మవారి అనుష్టానం ఉంది. మరెక్కడా లేని విధంగా అమ్మవారికి మంత్ర ప్రదానంగా అర్చనా విధులు ఇక్కడ జరుగుతాయి. అమ్మవారి విగ్రహారాధన కూడా కేవలం విశాఖ శ్రీ శారదాపీఠంలోనే కనిపిస్తుంది. వేదకాలంలో భండాసురుడనే రాక్షసుడిని సంహరించడానికి ఆ జగన్మాతయే రాజశ్యామల అమ్మవారిగా మంత్ర తంత్ర ప్రదానంగా అవతరించినట్లు చెబుతారు. హయగ్రీవుడు అగస్త్యునికి ధర్మ సూక్ష్మాలను ఉపదేశిస్తున్న సమయంలో రాజశ్యామల ప్రస్తావన వచ్చింది. ఎంతోమంది రుషులు, మునులు అనేక ఉపాసనా గ్రంథాలలో రాజశ్యామల యొక్క అనుష్టానాన్ని, తత్వాన్ని విశేషంగా ప్రస్తావించారు. శారదా తిలకం, ప్రపంచ సార తంత్రం, ఆమ్నాయ మందారం తదితర ఉత్కృష్టమైన గ్రంథాలలో, మహావిద్య ఉపాసనలో కూడా అమ్మవారి మహిమ అపారంగా కనిపిస్తుంది. విశాఖ శ్రీ శారదాపీఠంలోని రాజశ్యామల అమ్మవారి ఆలయంలో గురువుల ద్వారా ప్రాప్తించిన రాజశ్యామల అమ్మవారి ఉత్సవ విగ్రహం మూలవిరాట్టుకు ఉత్తర భాగాన ఉంటుంది. అమ్మవారికి సుఖ శ్యామల, వీణా శ్యామల, శారద, రాజమాతంగి అనే ఇతర నామాలు కూడా ఉన్నాయి. రాజశ్యామల అమ్మవారి గురించి విశేషంగా చెప్పాలంటే రాజకీయ లబ్ధిని ఆశించే నేతలు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తుంటారు. ఎందుకంటే అమ్మవారి రథం గేయ చక్రం. అది విజయానికి సంకేతం. భండాసుర సంహార వేళ జరిగిన యుద్ధంలో తంత్రము, మంత్రాంగం ఈ అమ్మవారే నిర్వహించిన కారణంగా రాజకీయ రంగంలో ఉన్నవారు అమ్మవారిని పూజిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్న విశ్వాసం సర్వత్రా నెలకొంది. ఈకారణంతోనే రాజకీయ రంగానికి చెందిన అగ్రగణ్యులు, అనేకమంది రాజనీతిజ్ఞులు విశాఖపట్నం వచ్చి రాజశ్యామల అమ్మవారిని పూజిస్తుంటారు.

ఈ రాజశ్యామల అమ్మవారి ఉపాసనతో రాజ్యాధికారం దక్కించుకున్న వారెందరో ఉన్నారు.

# కార్మికులు చిందించిన రక్తతర్పణమే మేడే

**బద్వేలు**



ప్రపంచ కార్మికుల దినోత్సవ సందర్భంగా బి కోడూరు మండలంలో ఏఐటీయూసీ స్థానిక ఆసుపత్రి ఆవరణంలో కార్మికులతో కలిసి జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏ ఐ టి యూ సి నాయకులు వెంకటరమణ మాట్లాడుతూ.. 1886లో చికాగో నగరంలో 8 గంటల పని దినాల కొరకు వేలాదిమంది కార్మికుల రక్తంతో ఏర్పడినదే మే డే, అని ఆయన పేర్కొన్నాడు. ఆనాడు 18 గంటల పనిలో కార్మికుల కుటుంబాలతో గడుపుటకు కూడా సమయం లేక ఉండే ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులతో సంబంధాలు కరువయ్యాయి అలాంటి స్థితి నుండి ఈరోజు కార్మిక కర్షక ఉద్యోగ ఉపాధ్యాయులు సంతోషంగా ఉన్నారంటే ఆనాడు కార్మికులు చిందించిన రక్తతర్పణమే, భారతదేశంలో 1923లో తమిళనాడులో మొట్టమొదటి కార్మిక దినోత్సవం జరిగింది. తర్వాత అంబేద్కర్ రాజ్యాంగం ఫలమే ఈరోజు భారతదేశంలో ఎనిమిది గంటల పని దినం అని ఆయన అన్నాడు. కనుక ప్రపంచవ్యాప్తంగా కార్మికులకు పెద్ద పండగ ఈ ప్రపంచ కార్మికుల దినోత్సవం. అయితే ఇప్పుడు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను ఉల్లంఘిస్తూ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించకుండా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ, కార్మికుల పొట్ట కొట్టారు. కనుక దేశంలోని కార్మిక కర్షక ఉద్యోగ ఉపాధ్యాయులు వెన్నెముకైన ఉత్పత్తిదారులను ఆదుకోకుండా వారి హక్కులను కాలు రాస్తుండడం సహించరానిది. కనుక అందరూ ఏకమై బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఆయన కోరాడు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎర్ర పల్లె ప్రసాద్ రావు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కామ గాండ్ల ఓబయ్య, దళిత వేదిక, నాయకులు నాగిపోగు నారాయణ, ఎం సి కే డి పి ఎస్ వైస్ ప్రెసిడెంట్ రామ లక్ష్మయ్య, కార్మిక నాయకులు రామోజీ అనిల్ సంతోష్ వంశి చిన్న ఓబయ్య సుబ్బయ్య, యాగప్ప, సగబాల ఓబయ్య మధు తదితరులు పాల్గొన్నారు.

# యువగళంలో జనసేన జెండాలు

**కర్నూలు :**

ఏపీలో కొత్త రాజకీయ పొత్తు పొడుస్తోందా..లేదంటే ఇప్పటికే రహస్య పొత్తు కుదిరిందా..ఎందుకంటే..టీడీపీ.. జనసేన వ్యవహారాన్ని చూస్తుంటే ఏపీ ఓటర్లకు ఏదీ అర్థం కావడం లేదు..పొత్తుల గురించి మాట్లాడనేలేదని జనసేనాని చెబుతారు. టీడీపీ అధినేత ఏదీ స్పష్టంగా చెప్పరు. ఎవరేమనుకుంటే అదే నిజం అన్నట్లుగా ఓ పీలర్ వదులుతారు.. కానీ లోకేష్ పాదయాత్రలో మాత్రం.. జనసేన జెండాలు ఎగురుతున్నాయి. ఇది దేనికి సంకేతం..పొత్తు పొడిచినట్లా. .రహస్య ఒప్పందం కుదిరినట్లా.. ఇంతకీ చంద్రబాబు, పవన్ భేటీలో దేని గురించి మాట్లాడారన్నది ఇప్పటికే ఎవరి అర్థంకాని విషయమే..ఏపీ రాజకీయం రంజుగా మారుతోంది. ముఖ్యంగా ప్రతిపక్షాల పొత్తుల ఎత్తుల కత్తులు పదునెక్కుతున్నాయి. చంద్రబాబు పవన్ భేటీలో దేని గురించి మాట్లాడినా..పబ్లిక్ మాత్రం పొత్తు పొడిచిందనే అనుకుంటున్నారు. అటు బీజేపీతో పొత్తు పెట్టుకున్న పవన్.. బాబుతో కూడా మిత్రలాభం కోరుకుంటున్నారు. ఈ పరిణామం ఎలాంటి ఫలితాలనిస్తుందో కానీ..పవన్ మాత్రం చంద్రబాబును వదలడం లేదు. బాబు కూడా పవన్‌ను కోరుకుంటున్నారు ఇద్దరి సమావేశం ఎన్నో అర్థాలకు దారి తీసింది. అయితే పవన్ మాత్రం పొత్తు విషయంపై క్లారిటీ ఇవ్వరు.. చంద్రబాబు చెప్పను గాక చెప్పరు. అంతా సస్పెన్స్.. కానీ ఏదో జరిగిపోయినట్లు ఓ పీలర్ జనాల్లోకి వదులుతారు. ఇందుకు నిదర్శనమే ..లోకేష్ పాదయాత్రలో జనసేన జెండాల రెపరెపలు..కర్నూలు జిల్లా ఎమ్మిగ నూరులో జరుగుతున్న లోకేష్ పాద యాత్రలో జనసేన జెండాలు మెరిశాయి. జనసేన కార్యకర్తలు యువ గళం పాదయాత్రలో పాల్గొని హంగామా చేశారు. దీన్ని బట్టి..టీడీపీ జనసేన మధ్య పొత్తు కుదిరింద నుకోవాలా. .లేదంటే ఏదో స్నేహం కోసం జనసేనాని..తన కార్యకర్తలను యువగళంలో జనసేన గళం వినిపిం చమని పంపించారా.. ఎలా అర్థం చేసుకోవాలి జనసేనాధిపతి.. మరోవైపు, పొత్తుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగానే చంద్రబాబు–పవన్ సమావేశం జరిగిందని చెబుతున్నారు జనసేనలో నెంబర్ 2 లీడర్ నాదెండ్ల మనోహర్..ఇదొక్కటే కాదు. .భవిష్యత్‌లో మరిన్ని సమావేశాలు ఉంటాయని స్పష్టం చేశారు. విపక్షాల మధ్య ఓట్లు చీలకుండా జనసేన చూసుకుంటుందట..యువగళంలో జనసేన జెండాలు కనిపించాయంటే.. టీడీపీకి జనసేన సంఘీబావమా..అదనపు బలమా..ఎన్నికలకోసం పొత్తు పొడిచిన బలగమా..మనోహర్ చెప్పినదాన్ని బట్టి చూస్తే..తమ్ముళ్లు, జనసేన కార్యకర్తలు కలిసిపోయినట్లే..రెండు పార్టీల మధ్య పొత్తు పొడిచినట్లే.. అందుకు ..ఎమ్మిగనూరులో జరుగుతున్న లోకేష్ పాదయాత్రలో మెరిసిన జనసేన జెండాలే నిదర్శనం

# ఏపీలో సింగిల్ సబ్జెక్టులో డిగ్రీ

**గుంటూరు:**

ఏపీలోని డిగ్రీ కాలేజీల్లో రానున్న విద్యాసంవత్సరం (2023–24) నుంచి సింగిల్ సబ్జెక్టు డిగ్రీ కోర్సులను ప్రవేశపెడుతున్న నేపథ్యంలో డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు దరఖాస్తు చేసుకునేందుకు ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న మూడు ప్రధాన సబ్జెక్టుల కోర్సుల నుంచి సింగిల్ సబ్జెక్టుకు మారేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇందుకోసం ప్రాసెస్ ఫీజు కింద ఒక్కో కళాశాల రూ.5 వేలు చెల్లించాలని, పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపింది. ప్రస్తుతం బీఎస్సీ ఆనర్స్ (ఎంపీసీ)లో 50 సీట్లుంటే వాటిని గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం సబ్జెక్టుల్లో ఏదో ఒక దాంట్లో 50 సీట్లను కళాశాల పెట్టుకోవచ్చు. లేదంటే ఒక్కో సబ్జెక్టులో 25 సీట్ల చొప్పున సర్దుబాటు చేసుకోవచ్చు. ప్రస్తుతానికి మొదటి సంవత్సరం సిలబస్‌ను ఖరారు చేశారు. ప్రధానంగా ఒక సబ్జెక్టు తీసుకుంటే మైనర్‌గా మరో సబ్జెక్టు చదవాల్సి ఉంటుంది. వీటితోపాటు నైపుణ్యాభివృద్ధి కోర్సు ఉంటుంది. మేజర్, మైనర్ సబ్జెక్టుల్లో ఏదో ఒకదాంట్లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

**బదిలీలపై సర్కారీ టర్న్...**

ఏపీలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలపై గతేడాది జారీ చేసిన జీవో 187ను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. రాష్ట్ర హైకోర్టుకు తెలిపిన విధంగానే ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. జీవో 187లోని మార్గదర్శకాలు లోపభూయిష్టంగా ఉన్నాయంటూ పలువురు ఉపాధ్యాయులు హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేశారు. గతేడాది డిసెంబరు 26న విచారణ జరిపిన హైకోర్టు.. బదిలీ మార్గదర్శకాలు సక్రమంగా లేవని ప్రాథమికంగా అభిప్రాయపడింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం జీవోను ఉపసంహరించుకుంది. 2023–24 విద్యా సంవత్సరానికి పాఠశాలలు జూన్ 12న తిరిగి ప్రారంభం కానున్నందున మళ్లీ బదిలీ మార్గదర్శకాలు రూపొందిస్తామని ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఈ మేరకు త్వరలోనే కొత్త మార్గదర్శకాలతో ఉత్తర్వులు జారీ చేస్తామని విద్యాశాఖ పేర్కొంది. ఉపాధ్యాయుల బదిలీ మార్గదర్శకాలకు సంబంధించి గత ఏడాది డిసెంబర్ 10న ఏపీ ప్రభుత్వం జీవో 187ను జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆ జీవోను ఇప్పుడు ఉపసంహరించుకుంది ప్రభుత్వం. ఈ మేరకు ప్రభుత్వ న్యాయవాది వీకే నాయుడు హైకోర్టుకు జీవో ఉపసంహరణకు సంబంధించి మెమోను నివేదించారు. ఈ జీవో ఉపసంహరణకు సంబంధించి మెమోను కోర్టు దృష్టికి తీసుకొచ్చిన ప్రభుత్వ న్యాయవాది ఈ మేరకు వివరాలను కోర్టుకు సమర్పించారు. 2022–23 విద్యా సంవత్సరానికి ఏప్రిల్ 30 చివరి పనిదినమని, 2023–24 విద్యా సంవత్సరానికి గాను జూన్ 12వ తేదీన పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయని కోర్టుకు సమర్పించిన మెమోలో విద్యాశాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో జీవో 187, తదనంతరం జారీ చేసిన సవరణలను ఉపసంహరించుకోవాలని నిర్ణయించుకున్నట్లు విద్యాశాఖ స్పష్టం చేసింది. అయితే ఉపాధ్యాయుల బదిలీ మార్గదర్శకాలు మళ్లీ రూపొందిస్తామని విద్యాశాఖ కోర్టుకు నివేదించిన మెమోలోపేర్కొంది

# కన్నడిగులపై మోడీ ఆశలు

**బెంగళూరు:**



సుడిగాలి పర్యటనల్లో భాగంగా ప్రధాని నరేంద్రమోడీ 22 ర్యాలీల్లో పాల్గొనబోతున్నారు. మే 2న మళ్లీ కర్ణాటక వస్తారు. 2, 3న ప్రచారం చేసి.. మళ్లీ ఢిల్లీ వెళ్లి... తిరిగి మే 6, 7 కర్ణాటకలో ప్రచారం చేస్తారు.కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంపై బీజేపీ చాలా భారీగా ఫోకస్ పెట్టింది అనేది ఒక అంశమైతే. ఓడిపోతామనే ఉద్దేశంతోనే... ఈ స్థాయిలో ప్రచారం చేస్తోంది అనేది మరో కోణం. రెండింటినీ విశ్లేషించు కుందాం .బీజేపీకి ఉన్న ప్లస్ పాయింట్ ఏంటంటే ఆ పార్టీ ఎన్నిక ఏదైనా దాన్ని ప్రతిష్టాత్మకంగానే తీసుకుంటుంది. ప్రతీ ఎన్నికపైనా కింది నుంచి పై స్థాయి వరకూ అందరూ ఫోకస్ పెడతారు. ఇక పార్టీ అధికారంలో ఉన్న చోట అసెంబ్లీ ఎన్నికలు వస్తే ఊరుకుంటారా.. ప్రచార హోరు మామూలుగా ఉండదు. ఇప్పుడు కర్ణాటకలో జరుగుతున్నది అదేకర్ణాటక ఎన్నికల ప్రచారానికి మే 8 వరకే టైమ్ ఉంది. అంటే ఇవాళ్టి నుంచి 10 రోజులు మాత్రమే టైమ్ ఉంది. మే 10న ఎన్నికలు, 13న ఫలితాల ప్రకటన ఉంటుంది. అందువల్ల ఈ 10 రోజుల్లో జోరుగా ప్రచారం చేస్తే... ప్రజల్లోకి పార్టీని బలంగా తీసుకెళ్లినట్లు అవుతుందని బీజేపీ స్కెచ్ వేసింది. స్వయంగా ప్రధానితోనే ప్రచారం చేయించడం ద్వారా... రాష్ట్ర స్థాయిలో వస్తున్న అవినీతి ఆరోపణలను చిన్నవిగా చూపించినట్లు అవుతుందని ఆ పార్టీ భావిస్తోంది. ప్రతిపక్ష కాంగ్రెస్ నుంచి రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ లాంటి వారు ప్రచారం చేస్తుండటంతో.. వారికి చెక్ పెట్టేందుకు ప్రధాని మోదీ రంగంలోకి దిగినట్లు కనిపిస్తోంది. ఐతే... ఇప్పటికే బీజేపీ తరపున అమిత్ షా, జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రచారం చేశారు.సర్వేలు చూస్తే.. ఈసారి కాంగ్రెస్‌కి కన్నడ ప్రజలు పట్టం కడతారని చెబుతున్నాయి. అదే సమయంలో సంకీర్ణ ప్రభుత్వం వస్తుందని అంటున్నాయి. వీటిని కొట్టి పారేస్తున్న బీజేపీ.. వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చి తీరతామని అంటోంది. అందుకు తగ్గటుగానే ప్రచారం తీరు ఉంది. మరి 224 స్థానాల్లో ప్రజలు ఎటువైపు నిలుస్తారన్నది ఆసక్తికరం.ఇదివరకు మోదీ ప్రచారం చేసిన చాలా రాష్ట్రాల్లో బీజేపీకి కలిసొచ్చింది. యూపీలో యోగి ఆదిత్యనాథ్ తరపున ప్రచారం చేసిన మోదీ.. డబుల్ ఇంజిన్ సర్కార్ అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి.. తిరిగి భారీ మెజార్టీతో బీజేపీని గెలిపించారు. ఇప్పుడు కర్ణాటకలోనూ బసవరాజ్ బొమ్మై తరపున ప్రచారం చేస్తూ . డబుల్ ఇంజిన్ సర్కార్ నినాదాన్ని మరోసారి తెరపైకి తేవాలనుకుంటున్నారు. అంతేకాదు.. కాంగ్రెస్ వస్తే రివర్స్ గేర్ అవుతుందని సెటైర్స్ వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కన్నడ నాడి ఎలా ఉంటుంది అనేది దేశవ్యాప్తంగా ఆసక్తి రేపుతోంది.ఈసారి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలకూ కలిపి మొత్తం 2,613 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఒక్క అధికార బీజేపీ మాత్రమే 224 స్థానాల్లో తమ అభ్యర్థులను నిలబెట్టింది. ప్రతిపక్ష కాంగ్రెస్ 223 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టగా.. జేడీఎస్ నుంచి 207 మంది, ఆమ్ ఆద్మీ పార్టీ తరపున 209 మంది పోటీ పడుతున్నారు. బీఎస్పీ నుంచి 133 మంది, జేడీయూ నుంచి 8 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. సిపిఐ నుంచి నలుగురు పోటీ పడుతుండగా.. స్వతంత్రులు 918 మంది ఉన్నారు. మే 10న ఎన్నికలు.. 13న ఫలితాలు రానున్నాయి

# ఈ సారి బరిలోకి జానారెడ్డి వారసులు

**నల్గొండ :**



కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎల్పీ లీడర్ కుందూరు జానారెడ్డి వచ్చే ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండబోతున్నారని ఆయన సన్నిహితులు అంటున్నారు. తన ఇద్దరు కొడుకులకు రాజకీయంగా లైన్ క్లియర్ చేసేందుకు ఆయన క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకునేందుకు సిద్ధమవుతున్నారు. నల్గొండలో శుక్రవారం మీడియా చిట్ చాట్ లో ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. తాను ఎమ్మెల్యేగా పోటీ చేసే ప్రసక్తే లేదని, పరిస్థితులు సహరిస్తే సీఎం పదవి వదులుకోనని తేల్చిచెప్పారు. 70 ఏండ్ల వయసున్న జానారెడ్డి ఇటీవల కొంత అనారోగ్యానికి గురయ్యారు. తన కొడుకులను బరిలోకి దింపడానికి ఇదే సరైన సమయమని ఆయన భావిస్తున్నట్లు తెలిసింది. రాజకీయాల్లోకి రావాలని ఆయన కొడుకులు జయవీర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి ఎప్పటి నుంచో ఆశపడుతున్నారు. ఈ విషయంలో జానా రెడ్డిపై కొడుకుల నుంచి ఒత్తిడి కూడా ఉందని అంటున్నారు. ఇటీవల నాగార్జునసాగర్‌కు చెందిన ముఖ్యనేతలతో జరిగిన భేటీలో వచ్చే ఎన్నికల్లో జయవీర్, రఘువీర్ పోటీ చేస్తారని జానారెడ్డి చెప్పినట్టు సమాచారం. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న జానారెడ్డి అనేక పదవులు నిర్వహించారు. 2014 లో కాంగ్రెస్ పవర్ లోకి వస్తే ఆయన సీఎం అవుతారన్న ప్రచారం కూడా జరిగింది. కానీ ఆ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. కాంగ్రెస్ కూడా అధికారంలోకి రాలేక పోయింది .2018 ఎన్నికల్లో నాగార్జున సాగర్‌లో జానారెడ్డిపై గెలిచిన నోముల నర్సింహయ్య చనిపోవడంతో ఉప ఎన్నిక జరిగింది. 2021 ఉప ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన ఓడిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. అప్పుడే రాజకీయాల నుంచి రిటైర్మెంట్ ప్రకటించారు. కానీ, రేవంత్ రెడ్డి పీసీసీ పగ్గాలు చేపట్టడంతో ఆయన పార్టీలో యాక్టివ్ అయ్యారు. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ గ్రూపులను సమన్వయం చేయడంలో జానారెడ్డి పెద్దన్న పాత్ర పోషిస్తున్నారు. ఇదే సమయంలో తన వారసులను బరిలో దింపేందుకు ఆయన పావులు కదుపుతున్నారు. ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర్ రెడ్డిల మధ్య సీట్లకు సంబంధించి సయోధ్య కుదిరితే జయవీర్, రఘువీర్ లకు అవకాశం దొరకవచ్చునని అంటున్నారు. బీఆర్ ఎస్, సీపీఎం మధ్య పొత్తు ఉండీ.. మిర్యాలగూడను సీపీఎంకు వదిలితే రఘువీం అక్కడ నుంచి పోటీ చేయడం ఖాయమని పార్టీ సీనియర్లు అంటున్నారు. జయవీర్ రెడ్డి మాత్రం నాగార్జునసాగర్ నుంచే బరిలో ఉంటారని భావిస్తున్నారు. ఉప ఎన్నికల నాటి నుంచే జయవీర్ సాగర్ లో పార్టీ లీడర్లు, ప్రజలతో టచ్ లో ఉంటున్నారు. రఘువీర్ రెడ్డి మిర్యాలగూడలో క్యాంప్ ఆఫీసు ఓపెన్ చేశారు. మిర్యాలగూడలో జరిగే అన్ని కార్యక్రమాల్లో తండ్రితో కలిసి పాల్గొంటున్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేయను, పార్టీ హైకమాండ్ ఆఫర్ చేస్తే సీఎం పదవి స్వీకరిస్తానని జానారెడ్డి మీడియా చిట్ చాట్ లో తెలిపారు. సీఎం అయితే తన కొడుకు గెలిచిన స్థానం నుంచి రాజీనామా చేయించి తాను పోటీ చేస్తానన్నారు. అవసరమై తే ఉత్తమ్ తన కోసం ఎమ్మెల్యే పదవి వదులుకుంటాడని చెప్పగా.. ఉత్తమ్ కూడా అంగీకారం తెలిపారు.

# కొత్త మండలాల్లో జీతాల ఘోష

**కరీంనగర్ :**

పేరుకి ప్రభుత్వోద్యోగమే అయినా ఆర్నెల్లుగా నయాపైసా జీతం లేక అల్లాడిపోతున్నారు. కొత్త మండలాల్లోని రెవిన్యూ ఉద్యోగులు. గతేడాది సెప్టెంబర్ 26వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 13 కొత్త మండలాలను ఏర్పాటు చేస్తూ జీవో నంబరు 97 జారీచేసిన సంగతి తెలిసిందే.ఇందులో భాగంగా తొలుత తహసీల్దార్ కార్యాలయాలకు రూపు నిచ్చారు. ఆయా జిల్లాల్లోని వివిధ మండలాల్లో పనిచేసే సిబ్బందికి వాటిలో పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉందికానీ.. కొత్త మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది వేతనాల మంజూరు కోసం సీసీఎల్ఏ నుంచి 'క్యాడర్ స్ట్రెంత్'సర్క్యులర్ జారీచేయాల్సి ఉంటుంది. ఈ జీవో జారీ ఆరు నెలలుగా జాప్యమవుతోంది. దీంతో సిబ్బందికి వేతనాలు అందడంలేదు. విధులు నిర్వర్తిస్తున్నా.. తమకు జీతాలు రాకపోవడంపై సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్యాడర్ స్ట్రెంత్ జీవో జారీకోసం కొందరు జిల్లా కలెక్టర్లు సీసీఎల్ఏకు మొరపెడుతూ లేఖలు రాసినా పట్టించుకునే వారులేరు. జీవో జారీ కాకపోవడంతో ఉద్యోగుల వివరాలు, బ్యాంకు ఖాతాలు, వేతనాల విడుదల వంటి అంశాల వివరాలు జిల్లా ట్రెజరీ కార్యాలయాల్లో నమోదు కాలేదు. ఫలితంగా ఆరు నెలలుగా జీతాలు లేక కొత్త మండలాల్లో పనిచేస్తున్న సుమారు 240 మంది రెవెన్యూ ఉద్యోగులు నానాతిప్పలు పడుతున్నారు.కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ కార్యాలయాల్లో హోదాల ప్రకారం ఉండాల్సిన సిబ్బంది, వేతన వివరాలు, ఆర్థికపరమైన అనుమతులను రెవెన్యూ పరిభాషలో క్యాడర్ స్ట్రెంత్ అంటారు. ఈ క్యాడర్ స్ట్రెంత్ జీవో విడుదల అయితేనే కొత్త మండలాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, వేతనాలు నేరుగా సంబంధిత జిల్లా ట్రెజరీ కార్యాలయాకు చేరుకునే అవకాశం ఉంటుంది. ఈ జీవోను సీసీఎల్ఏ జారీ చేయాల్సి ఉంటుంది.

–13 మండలాలు.. 240 మంది సిబ్బంది..

– కొత్త మండలాల జీవో జారీ కాగానే తహసీల్దార్ కార్యాయాలు ఏర్పాటు చేశారు.

– నిబంధనల ప్రకారం తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు గిర్దావర్లు(ఆర్ఐలు), ఒక సీనియర్ అసిస్టెంట్, ఒక జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, సర్వేయర్, అటెండర్, చైన్‌మన్‌తోపాటు గ్రామాల సంఖ్యను బట్టి 15?25 మంది వీఆర్ఏలను నియమించారు.

– జీవో 97 ప్రకారం ఇతర మండలాల్లోని సిబ్బందిని కొత్త మండలాల్లో నియమిస్తూ జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకున్నారు.

– ప్రస్తుతం కొత్తగా ఏర్పాటైన 13 మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో సుమారు 240 మంది ఉద్యోగులు వివిధ క్యాడర్లలో పనిచేస్తున్నారు.

# దళిత బంధు..ఇంటి దొంగలపై చర్చ

**అదిలాబాద్:**

ఏం మీ ఇంటి సొమ్ము అనుకున్నారా ? సర్కార్ ఇచ్చే దళిత బంధు పథకానికి మూడు లక్షల కమిషన్ అడుతున్నారట? ఉంటారా ..పోతారా అంటూ ఆమధ్య ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన రెండు నియోజకవర్గాల నాయకుల్ని ఉద్దేశించి అన్నారు సీఎం కేసీఆర్. ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాల నేతలకు సీఎం ఆ వార్నింగ్ టాక్. అయితే తాజాగా ప్రతినిధుల సదస్సులో కూడా వసూళ్లు చేసిన ఎమ్మెల్యేల చిట్టా నా దగ్గరుంది. పద్ధతి మార్చుకోండి అంటూ గట్టి వార్నింగ్ ఇచ్చారు సీఎం. అంటే.. ఆ చిట్టాలో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు ఉంటారనే ప్రచారం ఇప్పుడు ఇంకా ఊపందుకుంది. బోథ్ ,ఖానాపూర్, బెల్లంపల్లి, ముథోల్ నియోజకవర్గాలు ఆ లిస్ట్‌లో ఉన్నాయంటూ వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్‌లు చక్కర్లు కొడుతున్నాయి. కొన్ని చోట్ల అయితే నేతల బంధువుల పేర్లతో సహా లిస్ట్‌లు బయటికి వస్తున్నాయి. దీంతో ఈ ప్రచారం ఎక్కడ తమ కొంప ముంచుతుందోనని టెన్షన్ పడుతున్నారట ఎమ్మెల్యేలు. ఆ మధ్య ఆదిలాబాద్ జడ్పి సమావేశంలో జడ్పీటీసీలు సైతం దళితబంధు వసూళ్ళపై ఆరోపణలు చేశారు. ఒకే గ్రామంలో రెండు లక్షల చొప్పున చాలామంది దగ్గర వసూలు చేసినట్లు గుడిహత్నూర్ జడ్పీటీసీ ఆరోపించారు.బోథ్, ఖానాపూర్‌లో కమిషన్ల వ్యవహారాలు ఎమ్మెల్యేలకు తలనొప్పి తెచ్చిపెడుతున్నాయట. బోథ్‌లో కమిషన్లతో ఖరీదైన వాహనాలు కూడా కొనుక్కున్నారంటూ ప్రత్యర్థులు చేస్తున్న ఆరోపణలతో కొందరు నాయకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారట. ఇక ముథోల్‌లో అయితే ఏకంగా ఎమ్మెల్యే అనుచరుల తీరుపై ఆమధ్య రోడ్డెక్కి నిరసన తెలిపారు దళితులు. ఒకటి రెండు చోట్ల ఎమ్మెల్యేను సైతం నిలదీశారు. ఇవన్నీ ఒక్కఎత్తైతే ఇప్పుడు సీఎం వ్యాఖ్యలు తీవ్ర చర్చకు వస్తున్నాయట. సీఎం దగ్గరున్న చిట్టాలో తమ పేర్లు ఉన్నాయో, లేదోనని తెలుసుకునే పనిలో ఉన్నారట కొందరు అధికార పార్టీ శాసనసభ్యులు .అసలే ఎన్నికల టైం? ఇక మీరు కమీషన్లు, దందాలు ఆపండ్రా బాబూ? అని తమ అనుచరులకు గట్టిగానే చెబుతున్నారట కొందరు ఎమ్మెల్యేలు. ఖానాపూర్ నియోజకవర్గంలోని రెండు మండలాల్లో అడ్వాన్స్‌గా కొంత, పథకం వచ్చాక మిగతాది ఇవ్వాలని రూల్ పెట్టారట కింది స్థాయి నాయకులు. అప్పుడు వాళ్ళని పిలిచి క్లాస్ పీకారట ఎమ్మెల్యే. ఉమ్మడి జిల్లాలో పది నియోజక వర్గాలుండగా కొన్ని సెగ్మెంట్‌లలో చోటా మోటా లీడర్లు వసూళ్లు చేస్తే లీకైపోతుందని ఏకంగా కొంతమంది టీంను పెట్టుకున్నారట. ఇవన్నీ అధిష్టానానికి తెలిసిపోయాయని, ఈసారి సీటు కోత పెట్టదల్చుకున్నప్పుడు సీఎం ఆ లిస్ట్‌ను ముందు పెట్టవచ్చని అనుమానిస్తున్నారట కొందరు ఎమ్మెల్యేలు. అందుకే తీసుకున్న డబ్బు తిరిగి ఇచ్చేయాలన్న ఆలోచనలో కూడా ఉన్నారట. మొత్తం మీద ప్రతినిధుల సభలో కేసీఆర్ ఇచ్చిన వార్నింగ్ వసూల్ రాజాల మీద గట్టిగానే పనిచేసిందన్నది బీఆర్ఎస్ ఇంటర్నల్ టాక్.

ప్రజాతపన prajathapana.com

## చెక్కులు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు

**కమాన్ పూర్**

కమాన్ పూర్ మండలం గుండారం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. బిమంథనిఎమ్మెల్యే శ్రీధర్ బాబు సిఫార్సుతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ పంపిణీ చేశారు. పలు వైద్యశాలల్లో చికిత్స చేయించుకొని ఆర్థిక సహాయం కొరకు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం మంథని నియోజకవర్గ శాసనసభ్యులు ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ద్వారా సిఫార్సు చేసుకోగా మంథని ఎమ్మెల్యే శ్రీ దుద్దిల్ల శ్రీధర్ బాబు చొరవతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. గుండారం గ్రామానికి చెందిన రాచకొండ రాయమల్లు కి 28,500 రూపాయల చెక్కును మరియు రాచకొండ ఓదమ్మ కి 39,000 రూపాయల చెక్కును , కలవేన ఓదెలు 60,000 రూపాయల చెక్కును లబ్ధిదారులకు ఈరోజు కమాన్ పూర్ మండలము గుండారం గ్రామములో లబ్ధిదారులకు అందజేసిన కమాన్ పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైనల రాజు,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రంగు సత్యనారాయణ గౌడ్,జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి భుంపెల్లి రాజయ్య ,గ్రామ సర్పంచ్ ఆకుల ఓదెలు, పిడుగు శనీకర్ ,పెండ్యాల రాజు ,బొజ్జ సతీష్ జక్కుల శ్రీను, గణవేన రవి, అద్వాల చంద్రయ్య జంగిలి కనకయ్య , మూర్తి,గడ్డం శ్రీనివాస్, మజీద్ ఖాన్ , రాచకొండ ఓదెలు కొమురయ్య గోస్కూల లక్ష్మణ్, ముదాం శ్రావణ్ వడ్లకొండ శంకర్ ఆకుల రమేష్ రాచకొండ శ్రీను పిడుగు సదయ్య,ఆకుల రమేష్, మామిడి రాజు ,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## డా.బి.ఆర్ అంబేద్కర్ నూతన సెక్రటేరియట్ కు ప్రతిష్టాత్మక గ్రీన్ బిల్డింగ్ అవార్డ్

**హైదరాబాద్**



ప్రకృతి ప్రేమికుడైన సీఎం కేసిఆర్ చొరవ వల్లే అవార్డు వరించిందన్న మంత్రి వేములసెక్రటేరియట్:డా.బి.ఆర్ అంబేద్కర్ నూతన సెక్రటేరియట్ కు ప్రతిష్టాత్మక ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ అవార్డ్ దక్కింది. భారత దేశంలోనే మొట్ట మొదటి గోల్డ్ రేటెడ్ సెక్రటేరియట్ బిల్డింగ్ కాంప్లెక్స్ గా రికార్డుల్లోకెక్కింది. సోమవారం నాడు సెక్రటేరియట్ లో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వారు రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కి ఈ అవార్డు ప్రదానం చేశారు. అత్యంత విశాలంగా, అధునాతన హంగులతో కొత్త సెక్రటేరియట్ పర్యావరణహితంగా నిర్మించబడిందని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఈ క్రెడిట్ అంతా ప్రకృతి ప్రేమికుడైన ముఖ్యమంత్రి కేసిఆర్ గారికే దక్కుతుందన్నారు. కేసిఆర్ గారు చేపట్టిన హరితాహారం కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో గ్రీనరీ 7.7% కు పెరిగిందని గుర్తు చేశారు. వారి ఆలోచనలకు అనుగుణంగానే సెక్రటేరియట్ నిర్మాణం జరిగిందని తెలిపారు. రానున్న రోజుల్లో సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. త్వరలోనే ప్లాటినం అవార్డు కూడా గెలుచుకుంటామని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోనే మొట్ట మొదటి గోల్డ్ రేటెడ్ సెక్రటేరియట్ బిల్డింగ్ కాంప్లెక్స్ గా గుర్తింపు రావడం పట్ల తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని మంత్రి వేముల హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు రావడానికి సీఎం కేసిఆర్ గారి ఆదేశానుసారం ఇందులో నిమగ్నమై పనిచేసిన ఈఎన్సి గణపతి రెడ్డి టీం కు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రతిష్టాత్మక అవార్డు,అందుకు సంబంధించిన సర్టిఫికేట్ ప్రదానం చేసిన ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వారికి మంత్రి దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ శ్రీనివాస రాజు,ఈఎన్సి గణపతి రెడ్డి,ఎస్.ఈ లింగారెడ్డి, ఈ.ఈలు శశిధర్,శ్రీనివాస్,డి.ఈ దుర్గ ప్రసాద్ ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని పొట్టనపెట్టుకున్న కారు

**కాజులూరు :**

కోలంకలో విషాదం చోటుచేసుకుంది. పార్క్ చేసి ఉంచిన కారులో ఆడుకునేందుకు వెళ్లిన పాప...తిరిగిరాని లోకాలకు వెళ్లింది. కారు డోర్లు లాక్ అవడం.. ఎవరూ గమనించకపోవడంతో ఈ ఘోరం జరిగింది. ఇంటి సమీపంలో ఆడుకుంటున్న ఎనిమిదేళ్ల బాలిక అఖిలాండేశ్వరి.. దగ్గరల్లో పార్క్ చేసిన కారులోకి వెళ్లి డోర్ వేసుకుంది. మళ్లీ డోర్ లాక్ తీయరాకపోవడంతో ఊపిరి ఆడక ఇబ్బంది పడింది. ఈ క్రమంలో కారులో గాలి అందక పోవడంతో చిన్నారి స్పృహ కోల్పోయింది. మధ్యాహ్నం కారులోకి వెళ్లిన పాప సాయంత్రం వరకు అందులోనే ఉండిపోయింది. కూతురు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కలా మొత్తం గాలించారు. చివరికి ఇంటి పక్కన కారులో కొన ఊపిరితో బాలికను గుర్తించిన స్థానికులు హుటాహుటిన యానాం ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఇదిలా ఉండగా ఏడాది క్రితమే బాలిక తండ్రి మరణించగా.. బాలికతో పాటు, పదేళ్ల కొడుకును పాచి పనులు చేసుకుంటూ తల్లి ఆదిలక్ష్మి పోషించుకుంటోంది. తాజాగా కూతురు ప్రాణాలు కోల్పోవడంతో ఆ తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది

## సీపీఐ అధ్వర్యం లో మేడే వేడుకలు

**నందవరం**

మండల పరిధిలో సీపీఐ అధ్వర్యం లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్ హాజరై జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడుతూ.అందరికి 137వ మే డే శుభాకాంక్షలు తెలియజేశారు.పని గంటల కోసం అమెరికా దేశంలో చికాగో నగరంలో 20సంవత్సరాల పాటు సుదీర్ఘంగా పోరాటాల నిర్వహించి, కొన్ని వేల మంది బాలి ధనలతో సాధించిన 8గంటల పని విధానం రావడం జరిగింది. దాని స్పూర్తితో ప్రపంచంలోని వివిధ కార్మిక లోకం పోరాటాలు నిర్వహించి నేడు ప్రపంచంలోని అన్ని దేశాలలో 8 గంటల పని విధానం ప్రభుత్వ ప్రవైట్ సంస్థలలో అమలు జరుగుతుండటం వారి త్యాగ ఫలితం.భారత దేశంలో 70 సంవత్సరాల కాలంలో చాలా ప్రభుత్వలు చాలా మంది ప్రధానులు అనేక పరిశ్రమలు ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేస్తే నేడు కేంద్రంలో అధికారంలోకి ఉన్న బీజేపీ మోడీ ప్రభుత్వం దేశంలో ఉన్న బారి ప్రభుత్వ రంగ సంస్థలు అన్ని అదాని కి అంబానికి అప్పచోప్తు ప్రైవేటీకరణ చేస్తున్నారు. అదే విదంగా75 సంవత్సరాల కాలంలో సుదీర్ఘ పొరటలతో 44 కార్మిక చట్టాలను సాదించుకోవడం జరిగింది.



నేడు మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాల తూట్లు పొడుస్తూ 4కార్మిక కోడ్లు గా మార్చి కార్మిక హక్కులను కలరాస్తుంది..అధికారంలో రాక ముందు మోడీ సంవత్సరం కి 2కోట్ల ఉద్యోగుల ఇస్తాం అన్న మోడీ, రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానాని హామీని గాలికి వదిలేసి నిరుద్యోగులను మోసం చేస్తున్నారు..మరో వైపు రైతులను వ్యవసాయ రంగన్నీ అభివృద్ధి చేస్తాను అన్ని వాగ్దానం గాలికి వదిలేశారు..ప్రజా వ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వల గద్దె దింపి వరుకు పోరాటం ఆగదు అని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గిడ్డయ్య, సోమేశ్వర రెడ్డి, విజేంద్ర, శాంతన్న, నాగరాజు, విజయ కుమార్, మునిస్వామి, భీమన్న, రామలింగడు, రవి,తదితరులు పాల్గొన్నారు

## థాయ్ లాండ్ లో చీకోటి ప్రవీణ్ అరెస్ట్

**హైదరాబాద్:**

థాయ్‌లాండ్‌లో సంచలనం సృష్టించిన గ్యాంబర్ల అరెస్టులో తెలంగాణకు చెందిన వారుండటం కలకలం రేపుతోంది. అరెస్టైన వారిలో తెలంగాణకు చెందిన గ్యాంబ్లర్ చికోటి ప్రవీణ్, హైదరాబాద్‌లో నమోదైన ఈడీ కేసులో ం1గా ఉన్న మాధవరెడ్డి, మెదక్ ఆఅఅః బ్యాంకు ఛైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి ఉన్నారు. థాయిల్యాండ్‌కు చెందిన మహిళలతో కలిసి అక్కడ చికోటి ప్రవీణ్ గ్యాంబ్లింగ్ డెన్ ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. హైదరాబాద్ నుంచే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా జనాలను ఈ గ్యాంబ్లింగ్ కోసం తీసుకెళ్లినట్టు సమాచారం. వీళ్లందరిని శనివారం పటాయా తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. ఈ ఉదయం వీళ్లంతా ఇండియాకు తిరిగి బయలుదేరాలి. కానీ అర్ధరాత్రి పోలీసులు రెయిడ్ చేయడంతో అందరూ దొరికిపోయారు. బౌద్ధ మతాన్ని ఆచరించే థాయిల్యాండ్‌లో గ్యాంబ్లింగ్‌ను తీవ్ర నేరంగా పరిగణిస్తారు.మొత్తం 100 కోట్ల గ్యాంబ్లింగ్ చేస్తూ చిక్కినట్లు పోలీసులు తెలిపారు. పటాయాలో 80 మంది భారతీయులను అరెస్టు చేసినట్లు థాయ్ పోలీసులు తెలిపారు. దాదాపు రూ.20 కోట్ల విలువ చేసే గేమింగ్ చిప్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గ్యాంబ్లింగ్‌లో ఓ మహిళ కీలకంగా వ్యవహరించింది. కీలకంగా వ్యవహరించిన మహిళ సీతర్నన్ కేల్వేల్కర్‌ను థాయ్‌లాండ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒక్కొక్క ఇండియన్ నుంచి గ్యాబ్లింగ్ కోసం రూ.50 వేలు నిర్వాహకుల వసూలు చేశారు. మొత్తం ఇలా రూ.3 లక్షలు వసూలు చేశారు. 93 మందిలో నలుగురు మయన్మార్ దేశస్తులు, ఆరుగురు థాయ్ దేశస్తులు ఉన్నారు. ఏప్రిల్ 27 నుంచి ఓ హోటల్‌లో కాన్ఫరెన్స్ హాల్‌ను చికోటి ప్రవీణ్ అద్దెకు తీసుకున్నాడు. అక్కడ కొంతకాలంగా గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నాడుథాయ్‌లాండ్ పోలీసులను చూసి గ్యాంబ్లర్స్ పారిపోయే ప్రయత్నం చేశారు. థాయ్‌లాండ్‌లోని పాటాయాలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఖరీదైన హోటల్‌లో గ్యాంబ్లింగ్ డెన్ ఏర్పాటు చేసిన చికోటి.. థాయ్‌లాండ్ మహిళలతో కలిసి హోటల్‌లో క్యాసినో ఏర్పాటు చేశాడు.. అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించి గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నాడు. గ్యాంబ్లింగ్ కోసం కొంతమంది భారతీయులను కూడా అక్కడకు చికోటి



ప్రవీణ్ తీసుకెళ్లాడు. థాయ్‌లాండ్‌లో జూదంపై నిషేధం అమల్లోకి ఉంది. దీంతో గ్యాంబ్లింగ్ ఆడుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు.పట్టాయాలోని ఓ విలాసవంతమైన హోటల్‌పై సోమవారం తెల్లవారుజామున పోలీసులు జరిపిన దాడిలో ఎనభై మంది భారతీయ జూదగాళ్లు అరెస్టు అయినట్లు పోలీసులు తెలిపారు. బ్యాంగ్ లాముంగ్ జిల్లాలోని టాంబోన్ నాంగ్ ప్రూలోని సోయి ఫ్రా తమ్నాక్ 4లోని ఆసియా పట్టాయా హోటల్‌లో అర్ధరాత్రి సమయంలో దాడి జరిగింది. ఏప్రిల్ 27–మే 1 వరకు హోటల్‌లో అనేక మంది భారతీయులు గదులు బుక్ చేసుకున్నారని.. జూదం కోసం సంపావో అనే సమావేశ గదిని అద్దెకు తీసుకున్నారని డిటెక్టివ్‌ల నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈ దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు.

**భారీగా నగదు, గేమింగ్ చిప్స్ స్వాధీనం**

గతంలో చీకోటి ప్రవీణ్ క్యాసినో కేసుల్లో ఈడీ ప్రశ్నించిన వారే ఎక్కువగా ఉన్నారు. మాధవరెడ్డి అనే వ్యక్తితో పాటు మెదక్ డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి కూడా పోలీసులకు పట్టుబడిన ఫోటోల్లో ఉన్నట్లుగా తెలుస్తోంది. అరెస్ట్ అయిన వారి పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. అసలు నిర్వహకుడు చీకోటి ప్రవీణ్‌ను కూడా థాయిల్యాండ్ పోలీసులు పట్టుకున్నారని అంటున్నారు. నిందితుల నుంచి భారీగా నగదు, గేమింగ్ చిప్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకన్నారు. గేమింగ్ చిప్స్ విలువ రూ. 20 కోట్లకు పైగా ఉంటుందని స్థానిక పోలీసులు చెబుతున్నారు.చీకోటి ప్రవీణ్ థాయ్ ల్యాండ్‌కు చెందిన ఓ మహిళ సాయంతో ఈ కేసినోను అక్కడ నిర్వహిస్తున్నట్లుగా గుర్తించారు. భారత టూరిస్టులకు తాను ఇలాంటివి డబ్బులు తీసుకుని ఏర్పాటు చేస్తున్నానని తెలిపారు. పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని.. హోటల్‌లోని కన్వెన్షన్ హాల్ మొత్తాన్ని బుక్ చేసుకున్నామని.. అక్కడకు ఎవరినీ అనుమతించకుండా ఒక్క హోటల్ స్టాఫ్ కు మాత్రమే అనుమతించేలా జాగ్రత్తలు తీసుకున్నామని పోలీసులకు వెల్లడించినట్లుగా తెలుస్తోంది. అయితే.. కార్డులు, కార్డు డీలర్స్, గ్యాంబ్లింగ్ సామాగ్రి.. మొత్తం ఇండియా నుంచే వచ్చిందని తనకు సంబంధంలేదని చెప్పినట్లుగా తెలుస్తోంది. వచ్చిన వారంతా రేయింబవళ్లు ఈ జూదం ఆడుతున్నట్లుగా పట్టాయ పోలీసులు ప్రకటించారు. తాను విదేశాల్లో గ్యాంబ్లింగ్, కేసినోలు నిర్వహస్తానని చీకోటి ప్రవీణ్ బహిరంగంగానేప్రకటించారు. అయితే థాయ్ ల్యాండ్‌లో గ్యాంబ్లింగ్ చట్టబద్ధమేనని.. చట్ట వ్యతిరేకంగా ఏమీ చేయడం లేదని వాదించేవారు. కానీ ఇప్పుడు పట్టాయలోనే చట్ట వ్యతిరేకమని పోలీసులు అదుపులోకి తీసుకోవడం.. జైలుకు పంపడం సంచలనంగా మారింది. గ్యాంబ్లింగ్ కు మించి ఏదో చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పన్నెండు మంది మహిళలు కూడా పట్టుబడటం.. అసలు వెళ్లిన వారు అంతా ఎవరు అన్నదానిపై చర్చజరుగుతోంది. వారందరి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

## అకాల వర్షాలతో దెబ్బ తిన్న రైతులను ఆదుకోవాలి

**పెద్దపల్లి :**

అకాల వర్షాల వళ్ళ దెబ్బ తిన్న రైతులను ఆదుకోవాలని తడిసిన దాన్యం కొనుగోలుకు వెంటనే గ్రామాల్లో రైతులకు అందు బాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతుహక్కుల రాష్ట్ర కార్యదర్శి బియ్యపు శంకర్ యాదవ్ డిమాండ్ చేసారు. జిల్లాలో ఇటీవల వరుసగా కురిసిన వడగండ్ల వర్షాలకు నష్ట పోయేన రైతులను పారమశించారు.నేరుగా కల్లలవద్దకు వెళ్లి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం అకాల వర్షాల వళ్ళ దెబ్బ తిన్న పంటలు,దాన్యం, రైతుల గోడును అదనపు కలెక్టర్ కుమార్ ను కలిసి వివరించి వినతిపత్రం సమర్పించారు. అనంతరం బియ్యపు శంకర్ యాదవ్ మీడియా తో మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల వరుసగా కురిసిన వడగండ్ల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోరినట్లు తెలిపారు.వర్షానికి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల పరిహారం చెల్లించాలన్నారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలని, గత మార్చిలో వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులకు హామీ ఇచ్చిన సీఎం మాట నిలబెట్టుకోవాలని బియ్యపు శంకర్ యాదవ్ డిమాండ్ చేసారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో రైతన్నలు పూర్తిగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు నష్టపోయిన రైతులందరికీ యుద్ధప్రాతిపదికన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల నగదుతోపాటు వచ్చే సీజన్లో పూర్తి సబ్సిడీతో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందించాలని శంకర్ యాదవ్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. అలాగే ఇండ్లు దెబ్బతిన్న వారికి డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వాలన్నారు. పిడుగుపాటుతో చనిపోయిన కుటుంబాలకు 5లక్ష రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. గత మార్చిలో కురిసిన వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎకరాకు 10 వేల రూపాయల నష్టపరిహారం ఇస్తామని హామీ ఇచ్చారని ఆ మాటను వెంటనే నిలబెట్టుకోవాలని శంకర్ యాదవ్ డిమాండ్ చేశారు

## రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటాం

**హైదరాబాద్ :**

అన్ని మండలాల్లో జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి, పంట నష్టాన్ని పరిశీలించి, రైతులకు ధైర్యాన్ని కల్పించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, అధికారులతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. అకాల వర్షాలు, పంటల నష్టాలు, ధాన్యం కొనుగోళ్లపై చర్చించారు. సోమవారం హన్మకొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. దెబ్బ తిన్న పంటల నష్టాలను వెంటనే అంచనా వేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. అలాగే కౌలు రైతులతో పాటు నష్ట పోయిన రైతులకు పరిహారం అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణను వేగవంతం చేయాలన్నారు. రైతుల పంటలను ప్రభుత్వం పరంగా ఆఖరు గింజ వరకూ కొనుగోలు చేసే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. రైస్ మిల్లర్లతో సమావేశాలు నిర్వహించి, కాంటాల్లో కోతలు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని మంత్రి ఎర్రబెల్లి సూచించారు. సేకరించిన ధాన్యం రవాణాను సైతం వేగంగా చేపట్టాలన్నారు. సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని రైతులకు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. మక్కల కొనుగోలుకు కూడా ఏర్పాట్లు చేయాలని వివరించారు. సమీక్షా సమావేశంలో వర్ధన్నపేట, హుస్నాబాద్ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, సతీష్ బాబు, వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తా పట్నాయక్, వ్యవసాయ అధికారులు ఉషాదయాళ్, డి.ఆర్.డి.వో పిడిలు శ్రీనివాస్ కుమార్, సంపత్ రావు, అధికారులు పాల్గొన్నారు.

### భారీ వర్షాలతో పంటలన్నీ నీటిపాలు - ఆగమైతున్న అన్నదాతలు

వరంగల్ జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలు రైతులను నట్టేట ముంచాయి. ప్రధానంగా మక్కలు, వరి, మిర్చి, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కూరగాయలు, పండ్ల తోటలు, పసుపు తదితర పంటలూ దెబ్బ తిన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏ జిల్లాలో చూసినా నేలకొరిగిన చేన్లు, రైతుల కళ్లలో నీళ్లే కనిపిస్తున్నాయి. మండలాల వారీగా అగ్రికల్చర్? ఆఫీసర్లు నష్టం అంచనా కోసం సర్వేలు నిర్వహిస్తున్నారు. రికాంలేని వానలు, ఈదురు గాలులు, వడగండ్ల బీభత్సంతో నష్ట తీవ్రత అంతకంతకూ పెరుగుతున్నది.ప్రాథమికంగా అందుతున్న సమాచారాన్ని బట్టి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5 లక్షల ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు తెలుస్తోంది.ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హన్మకొండ, మూలుగు, మహబూబాబాద్, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ జిల్లాలో మామిడి పండ్లు నేల రాలాయి. ఎకరానికి రూ.25 వేల చొప్పున నాలుగు ఎకరాల్లో కౌలు పట్టి, మిర్చి పంట పెట్టగా... ఎకరానికి 40 క్వింటాళ్ల దిగుబడి రావాల్సింది రోగాల తోటి 15 నుంచి 20 క్వింటాళ్లే వచ్చినట్లు అన్నదాతలు చెబుతున్నారు. ఇక్కడ లేబర్ దొరక్కపోతే ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకొచ్చి, వాళ్లకు తిండి పెట్టి, నివాసం ఏర్పాటు చేసి మిర్చి కోయించి ఆరబెట్టి.. మార్కెట్ కు తీస్కెళ్లేందుకు లోడ్ చేస్తుండగా.. వర్షం కురిసిందని ఓ అన్నదాత ఆవేదన వ్యక్తం చేశాడు. పంట తడవకుండా ట్రాక్టర్ పై పైనుంచి టార్పాలిన్ కప్పినా కింది నుంచి నీళ్లు జేరి మిర్చి అంతా నీటి పాలైందని కన్నీరు పెట్టాడు. ప్రస్తుతం మిర్చి పంట క్వింటాలుకు రూ.20 వేల ధర పలుకుతోందని.. తడిసిన పంటను మరో వారం రోజులు ఆరబెట్టే సరికి కలర్ నల్లబడి రేటు తగ్గుతుందని వాపోతున్నాడు. ఆరుగాలం పడిన కష్టమంతా ఒక్క వానతోటి నీళ్లపాలైంది అని రైతులు ఆవేదన చెందుతున్నారు.

# మెగాస్టార్ చిరంజీవి, 'భోళా శంకర్' చిరంజీవి వింటేజ్ లుక్



మెగాస్టార్ చిరంజీవి, స్టైలిష్ మేకర్ మెహర్ రమేష్ మెగా మాసివ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ "భోళా శంకర్". రామబ్రహ్మం సుంకర అత్యంత ప్రతిష్టాత్మకంగా భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. మేకర్స్ ఇటీవల హైదరాబాద్‌లో హై-ఆక్టేన్ ఇంటర్వెల్ ఎపిసోడ్‌ను పూర్తి చేసారు. దానితో 80% షూటింగ్ పూర్తయింది.

మే డే సందర్భంగా చిరంజీవి వింటేజ్ మాస్ లుక్‌లో కనిపించే మూడు కొత్త పోస్టర్‌లను మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్లలో మెగాస్టార్ గ్రే కలర్ యూనిఫాంలో టాక్సీ డ్రైవర్‌గా కనిపిస్తున్నారు. ఓ పోస్టర్ లో టీ టైమ్‌ని ఆస్వాదిస్తూ కనిపించారు. ఛార్మింగ్ స్మైల్ తో యంగ్ అండ్ డైనమిక్ గా కనిపిస్తున్నారు మెగాస్టార్.

చిరంజీవి, కీర్తి సురేష్, తమన్నా, వెన్నెల కిషోర్, ఇతరులతో కూడిన ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించనున్న ఈ చిత్రం తదుపరి షెడ్యూల్ కోల్‌కత్తాలో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత చిరంజీవి, తమన్నాలపై ఓ పాటను చిత్రీకరించేందుకు యూరప్ వెళ్లనున్నారు. మహతి స్వర సాగర్ రాకింగ్ నెంబర్ ని స్కోర్ చేశారు. యూరప్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత కొంత టాకీ పార్ట్, క్లైమాక్స్ షూట్, భారీ సెట్ సాంగ్ చిత్రీకరిస్తాం. దాంతో జూన్ నెలాఖరుకు సినిమా షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి అనిల్ సుంకర ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ ఒ యాక్షన్ సమపాళ్లలో వుండనున్నాయి. తమన్నా కథానాయికగా నటిస్తుండగా, కీర్తి సురేష్, చిరంజీవి సిస్టర్ గా కనిపించనుంది. టాలెంటెడ్ యాక్టర్ సుశాంత్ ఈ సినిమాలో లవర్ బాయ్ పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రానికి డడ్లీ డీవోపీగా పని చేస్తున్నారు. సత్యానంద్ కథ పర్యవేక్షణ చేయగా తిరుపతి మామిడాల డైలాగ్స్ అందిస్తున్నారు. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్ గా, ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ నిర్మాత.

'భోళా శంకర్' ఆగస్టు 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. తారాగణం: చిరంజీవి, తమన్నా, కీర్తి సురేష్, సుశాంత్, రఘు బాబు, మురళీ శర్మ, రవిశంకర్, వెన్నెల కిషోర్, తులసి, సురేక వాణి, శ్రీ ముఖి, హైపర్ ఆది, వైవా హర్ష ,ప్రదీప్, అనీ, బిత్తిరి సత్తి, సత్య, గెటప్ శ్రీను, వేణు టిల్లు , తాగుబోతు రమేష్ ,రష్మీ గౌతమ్, ఉత్తేజ్, వీర్, షహ్వార్ అలీ ఒ తరుణ్ అరోరా




# 'మామా మశ్చీంద్ర' ఫస్ట్ సింగిల్ మే 4న విడుదల



నైట్రో స్టార్ సుధీర్ బాబు క్రేజీ ప్రాజెక్ట్ 'మామా మశ్చీంద్ర' లో త్రిపాత్రాభినయం లో కనిపించనున్నారు. యాక్టర్ -ఫిల్మ్ మేకర్ హర్షవర్ధన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పిపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు నిర్మించారు. ఇటీవలే విడుదల చేసిన ఈ చిత్రం టీజర్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్‌పై అప్‌డేట్‌తో వచ్చారు. మొదటి సింగిల్ గాలుల్లోన లిరికల్ వీడియో మే 4న విడుదల కానుంది. చైతన్ భరద్వాజ్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో సుధీర్ బాబు దుర్గా, డిజే గెటప్స్ లో కనిపించారు. మిర్నాలిని రవి డిజే వైపు చూస్తూ ఉండగా, ఈషా రెబ్బా చేతిలో బర్గర్ పట్టుకున్న దుర్గా తో సెల్ఫీ తీసుకుంటుంది.

పి జి విందా సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ చిత్రానికి రాజీవ్ ఆర్ట్ డైరెక్టర్. తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ ద్విభాషా చిత్రాన్ని సృష్టి సెల్యులాయిడ్ సోనాలి నారంగ్, సృష్టి సమర్పిస్తున్నారు. తారాగణం: సుధీర్ బాబు, మిర్నాలిని రవి, ఈషా రెబ్బా, హర్షవర్ధన్

# లవ్ & సైకలాజికల్ థ్రిల్లర్ 'అన్వేషి' టీజర్ విడుదల



ఓ యువకుడు డిటెక్టివ్ కావాలనుకుంటాడు. అదే సమయంలో ప్రేమలో పడతాడు. నచ్చిన అమ్మాయితో సంతోషంగా ఉంటాడు. అయితే అనుకోకుండా అతని జీవితం అనుకోని మలుపు తిరుగుతుంది. రాత్రి సమయంలో మారేడు కోన అనే ప్రాంతానికి రాకపోకలు నిషేధం. అలాంటి ఊరికి హీరో ఎందుకు వెళ్లాల్సి వచ్చింది!. అసలు మారేడు కోనకు, మా కథకు ఉన్న సంబంధం ఏంటనేది తెలుసుకోవాలంటే 'అన్వేషి' సినిమా చూడాల్సిందేనంటున్నారు నిర్మాత టి.గణపతి రెడ్డి. విజయ్ ధరణ్ దాట్ల, సిమ్రాన్ గుప్తా, అనన్య నాగళ్ల హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న లవ్ అండ్ సైకలాజికల్ థ్రిల్లర్ 'అన్వేషి'. అరుణ శ్రీ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై వి.జె.ఖన్నా దర్శకత్వంలో టి.గణపతి రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ మూవీ టీజర్‌ను సోమవారం ప్రముఖ నిర్మాత డి.సురేష్ బాబు లాంచ్ చేశారు. టీజర్‌ను గమనిస్తే థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ చాలానే ఉన్నట్లు తెలుస్తుంది. ఓ వైపు హీరో డిటెక్టివ్ కావాలనుకుంటాడు. అయితే అనుకోని కారణాలతో తను మారేడు కోనకు వెళ్లాల్సి వస్తుంది. అసలు నిజంగానే ఆత్మలున్నాయా? అనే కోణంలో అన్వేషి సినిమా ఆసక్తికరమైన కథాంశంతో రూపొందినట్లు సన్నివేశాలను చూస్తే స్పష్టమవుతుంది. విజయ్ ధరణ్ దాట్ల, సిమ్రాన్ గుప్తా, అనన్య నాగళ్ల పాత్రలను దర్శకుడు వి.జె.ఖన్నా ఆసక్తికరంగా మలిచినట్లు తెలుస్తుంది. చైతన్ భరద్వాజ్ మ్యూజిక్, సైమన్ కింగ్ బీజీఎం, కె.కె.రావు సినిమాటోగ్రఫీ ఆకట్టుకుంటున్నాయి.

ఈ సందర్భంగా నిర్మాత టి.గణపతి రెడ్డి మాట్లాడుతూ "నిర్మాతగా అన్వేషి నా తొలి చిత్రం. లవ్ అండ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా సినిమాను రూపొందించాం. మా డైరెక్టర్ వి.జె.ఖన్నా మంచి కథ, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను సీట్ ఎడ్జ్‌లో కూర్చోపెడతాయి. షూటింగ్ అంతా పూర్తయ్యింది. హీరో విజయ్, హీరోయిన్స్ సిమ్రాన్ గుప్తా, అనన్య నాగళ్ల అద్భుతంగా నటించారు. చైతన్ భరద్వాజ్‌గారు అద్భుతమైన సంగీతాన్ని అందించారు. అలాగే సైమన్ కింగ్‌గారి బీజీఎం హైలైట్‌గా ఉంటుంది. మా బ్యానర్‌కు అన్వేషి మంచి హిట్ అయ్యి మైల్ స్టోన్ మూవీగా నిలుస్తుంది" అన్నారు.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950